http://www.agnidharanews.com
# అగ్నిధార
బుధవారం 10 డిసెంబర్ 2025
నిజాల నిప్పు కణిక
ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్
పేజీలు : 8 వెల : 5/-
Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను
ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు
సెల్ : 80088 17828




## విందిస్తాం ఓటేయండీ

హైదరాబాద్‌లో ఉంటున్న ఓటర్లకు ఇక్కడే దావత్‌లు
పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు అభ్యర్థుల గాలాలు
పట్టణాల్లో నివాసముంటున్న గ్రామ ప్రజలకు దావత్‌లు
నగరానికీ వ్యాపిస్తున్న పంచాయతీ ఎన్నికల తాకిడి

హైదరాబాద్

పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. తొలి దశ ఎన్నికలు గురువారం జరగనుండటంతో మంగళవారం సాయంత్రానికే ప్రచారం ముగిసింది. దీంతో బరిలో నిలిచిన వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాన్ని ముమ్మరం చేశారు. ఖర్చులకు వెనకాడకుండా, గెలుపే ధ్యేయంగా ముందుకెళ్తున్నారు. ఎక్కువగా ఉపాధి నిమిత్తం పట్టణాల్లో నివసించే ఓటర్ల చెంతకు అభ్యర్థులే - మిగతా3లో

### స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధించేలా
## విజన్ డాక్యుమెంట్



- మారుమూల గ్రామంలోని రైతు కుటుంబం నుంచి నేను వచ్చాను
- గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన నాకు పేదలు, రైతుల సమస్యలు బాగా తెలుసు
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో రికార్డుస్థాయిలో ఒప్పందాలు
- భారత్ బయోటెక్ రూ.1000 కోట్ల పెట్టుబడి
- సమాజంలో ఉన్న వివక్షత నిర్మూలన తమ ప్రభుత్వ లక్ష్యం
- విజన్-2047 డాక్యుమెంట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

ఫ్యూచర్‌సిటీ

సమాజంలో ఉన్న వివక్షత నిర్మూలన తమ ప్రభుత్వ లక్ష్యం అని.. విద్య మీద ఖర్చు చేసేది వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ మీర్‌ఖాన్ పేటలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలంగాణ చైతన్యవంతమైన నేల అని సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధించేలా 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' డాక్యుమెంట్ రూపొందించినట్లు తెలిపారు. గ్లోబల్ సమిట్ ముగింపు వేడుకలో ప్రసంగిస్తూ 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాలవారిని సంప్రదించి - మిగతా3లో



## 'ఈసీ'ని కేంద్రం కబ్జా చేసింది

- ఆరెస్సెస్ ఆధిపత్యం చెలాయిస్తోంది
- ఆరెస్సెస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదు
- దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారు
- లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



## అమిత్ షా వర్సెస్ ఖర్గే

- వందేమాతరంపై రాజ్యసభలో మాటల యుద్ధం
- పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వందే మాతరంపై చర్చ
- వందే మాతరం ప్రభావం ఒక్క రాష్ట్రానికే పరిమితం కాదు!
- దేశభక్తి భావనకు ప్రతీక, జాతీయ సంస్కృతి, జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించే అమర సృజన
- "ఈ రోజు కూడా సరిహద్దుల్లో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసే సైనికుల చివరి మాట వందే మాతరమే"

### ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రతి రాష్ట్రంలో
## కొనసాగాల్సిందే



- బెంగాల్‌లో బీఎల్‌ఓలకు బెదిరింపులు... ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- అధికారులకు బెదిరింపులు రావడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు
- బీఎల్‌ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి మార్గాలు చూడాలని సూచన

## మిమ్మల్ని నిరాశపరిచాం... క్షమాపణలు కోరుతున్నా

- ఎక్స్ వేదికగా వీడియోను విడుదల చేసిన సీఈవో
- సర్వీసుల రద్దు కొనసాగుతున్నప్పటికీ పరిస్థితులు గాడిన పడుతున్నాయని వెల్లడి
- సంక్షోభం కారణంగా వేలాదిమంది ప్రయాణాలు కొనసాగించలేకపోయారని ఆవేదన




## సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు

- 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే అంటే 1980లో సోనియా గాంధీ ఓటు హక్కు
- మోసం, ఫోర్జరీ ద్వారా ఓటు హక్కు పొందిందని ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ పిటిషన్



### ఫ్యూచర్ సిటీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి
## అన్ని సౌకర్యాలు

- గ్లోబల్ సమిట్‌తో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పలువురు సినీ ప్రముఖులు
- చర్చలో పాల్గొన్న అల్లు అరవింద్, సురేశ్‌బాబు, దిల్‌రాజు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి
- చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్న సీఎం
- స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి



హైదరాబాద్

భారత్ ఫ్యూచర్ సిటీలో సినిమా స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమిట్‌లో భాగంగా సినీ ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సెషన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నిర్మాతలు అల్లు అరవింద్, దగ్గుబాటి సురేష్ బాబు, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నటులు జెనీలియా, అక్కినేని అమల, డైరెక్టర్ రాహుల్‌ల రవిచంద్రన్, పలువురు తెలుగు, హిందీ ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సినీ ఇండస్ట్రీ అభివృద్ధికి - మిగతా3లో



## నిబంధనలు జనజీవితాలకు భారంగా కాకూడదు

- కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి రాకుండా చూడాలి
- మంచి నియమ నిబంధనలు అనేవి వ్యవస్థలను మెరుగుపర్చేలా ఉండాలే తప్ప, ప్రజలను వేధించేలా ఉండకూడదు
- ఎన్‌డీఏ కూటమి ఎంపీల సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

### కేసీఆర్ అంటే పోరాటం..
## రేవంత్ అంటే వెన్నుపోటు

'డిసెంబర్ 9 అనేది చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు
నవంబర్ 29న దీక్షా దివస్ జరుపుకున్నాం
నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన లేదు
డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం లేదు.

హైదరాబాద్

కేసీఆర్ దీక్ష ఫలితంగానే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ అన్నారు. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా అని ప్రశ్నించారు. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా అని నిలదీశారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం అని, రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం అని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని చెప్పారు. తెలంగాణ భవన్‌లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా - మిగతా3లో



# నిబంధనలు జనజీవితాలకు భారంగా కాకూడదు

కేంద్ర మంత్రులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలక సందేశమిచ్చారు. చట్టాలు, నియమ నిబంధనలు అనేవి జన జీవితాలను సులభతరం చేసేలా ఉండేలా తప్ప, వారిపై భారంగా మారకూడదని మంత్రులకు ప్రధాని హితవు పలికారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నూతన మార్గదర్శకాల కారణంగా ఇండిగో ఎయిర్ లైన్స్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ప్రధాని మోదీ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. బుధవారం దిల్లీలో జరిగిన అధికార ఎన్‌డీఏ కూటమి ఎంపీల సమావేశంలో ప్రధానమంత్రి మోదీ ఈమేరకు సందేశాన్ని ఇచ్చారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి రాకుండా చూడాలని ఎంపీలు, మంత్రులకు ప్రధాని సూచించారని తెలిపారు. మంచి నియమ నిబంధనలు అనేవి వ్యవస్థలను మెరుగుపర్చేలా ఉండాలే తప్ప, ప్రజలను వేధించేలా ఉండకూడదని ప్రధాని తేల్చి చెప్పారని రిజిజు పేర్కొన్నారు. అనవసరంగా సాధారణ పౌరులకు ఇబ్బందిని, అసౌకర్యాన్ని కలిగించే చట్టాలు కానీ, నియమ నిబంధనలు కానీ లేకుండా చూడాలని కేంద్ర మంత్రులకు ప్రధాని సూచించారని తెలిపారు. ప్రభుత్వ రూల్స్ వల్ల ప్రజలకు సౌకర్యం కలగాలనే అభిప్రాయాన్ని నరేంద్రమోదీ వ్యక్తం చేశారన్నారు.

**షోకాజ్ నోటీసులకు బదులిస్తూ ఇండిగో లేఖ**

విమాన పైలట్ల పనిగంటలపై పరిమితులను విధిస్తూ గత సంవత్సరం కొన్ని నూతన మార్గదర్శకాలను డీజీసీఏ జారీ



చేసింది. ఈ మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చేందుకు అన్ని విమానయాన సంస్థలకు నిర్దిష్ట గడువును ఇచ్చింది. అయితే ఈ గడువులోగా మార్గదర్శకాల మేరకు సంస్థాగత ఏర్పాట్లను ఇండిగో ఎయిర్ లైన్స్ చేసుకోలేకపోయింది. ఈనేపథ్యంలో గత వారం రోజుల వ్యవధిలో ప్రతిరోజు వందలాది విమానాలను ఇండిగో రద్దు చేసుకుంది. ఫలితంగా దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్, సీఓఓ ఇసిడ్రె పోర్క్వెరస్‌లకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన డీజీసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసులు ఎందుకు రద్దు అవుతున్నాయి అనే దానిపై వివరణ ఇవ్వమని ఆ నోటీసుల్లో కోరారు. దీనికి బదులిస్తూ సోమవారం రోజు కేంద్ర ప్రభుత్వానికి ఇండిగో ఓ లేఖను పంపింది. ఇందులో పలు కీలకమైన అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. దీనిపై చర్చించి, ఇండిగో సంక్షోభానికి త్వరితగతిన ఒక పరిష్కారాన్ని కనుగొనేందుకు తాజాగా మంగళవారం రోజు అత్యున్నత స్థాయి సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందులో కేంద్ర పౌర విమానయాన శాఖ, విమానయాన సంస్థలు, డీజీసీఏ, ఇతర అనుబంధ విభాగాల సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.

**ఇండిగోకు డీజీసీఏ కఠిన ఆదేశాలు**

మరోవైపు ఇండిగోకు డీజీసీఏ కీలక ఆదేశాలు జారీ చేసింది. సకాలంలో విమాన సర్వీసులను అందించడంలో విఫలమైనందున, విమాన సర్వీసుల సంఖ్యను 5 శాతం మేర తగ్గించాలని ఇండిగోకు నిర్దేశించింది. విమానయాన సేవల అన్ని విభాగాల్లో సర్వీసులు సకాలంలో అందుబాటులో ఉండేలా సమీక్షించుకోవాలని, తగిన ఏర్పాట్లు తీసుకోవాలని సూచించింది. ఒక రూట్‌లో ఒకే విమానంతో విమాన సర్వీసులను నడిపే పద్ధతిని ఆపాలని ఇండిగోను డీజీసీఏ హెచ్చరించింది. విమాన సర్వీసుల రద్దుకు దారితీసే పద్ధతులను పాటించడాన్ని ఆపాల్సిందే అని తేల్చి చెప్పింది. విమాన సర్వీసుల రివైజ్డ్ షెడ్యూళ్ల సమాచారాన్ని గురువారం సాయంత్రం 5 గంటల్లోగా తమకు సమర్పించాలని ఇండిగోను కోరింది. మొత్తంమీద ఇండిగో సంక్షోభం గురించి నేరుగా ప్రస్తావించకుండానే, ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రధాని సూచన మేరకు విమానయాన రంగానికి సంబంధించిన నిబంధనలను సరళతరం చేస్తూ ఏదైనా నిర్ణయం వెలువడుతుందా ? లేదా ? అనేది వేచిచూడాలి.

# ‘ఈసీ’ని కేంద్రం కబ్జా చేసింది

ఎన్నికల కమిషన్ (ఈసీ)ను కేంద్రం కబ్జా చేసిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఆరెస్సెస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదన్నారు. దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంస్కరణల అంశంపై లోక్‌సభలో ఆయన ప్రసంగిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో వివరించారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రానికి మూడు ప్రశ్నలు వేశారు.

ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా?

సర్ ప్రక్రియపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో.. ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా? నరేంద్ర మోదీ షెడ్యూల్‌కు అనుగుణంగానే ఈసీ ఎన్నికలు! నిజాలు మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. దేశంలోని వ్యవస్థలన్నింటిపైనా ఆధిపత్యం చెలాయిస్తోందని మండిపడ్డారు. మహాత్మా



గాంధీ హత్య తర్వాత దేశంలోని సంస్థాగత చట్టాన్ని స్వాధీనం చేసుకునే ప్రాజెక్ట్?ను ఆరెస్సెస్ చేపట్టిందని రాహుల్ అన్నారు. ఆరెస్సెస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదన్న రాహుల్, సమానత్వ భారతం కోసం తపించిన జాతిపితను హత్య చేశారని వ్యాఖ్యానించారు. దేశంలోని వైవిధ్యాన్ని ఆర్‌ఎస్ఎస్ నాశనం చేస్తోందన్నారు. ఆర్‌ఎస్ఎస్‌కు నచ్చని నిజాలను క్రమానుగతంగా ప్రజలకు దూరం చేస్తున్నారని రాహుల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్‌ఎస్ఎస్ ఒక్కొక్కటిగా అన్ని వ్యవస్థలను కబ్జా చేస్తోందన్నారు. దేశంలోని వ్యవస్థలన్నిటిపైనా ఆధిపత్యం చూపిస్తోందని విమర్శించారు.

**150 కోట్ల ప్రజలతో కుట్టిన వస్త్రమే భారత్?**

ఈసీ, ఈడీ, సీబీఐ వంటి స్వతంత్ర సంస్థలను కేంద్రం కబ్జా చేసిందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌కు అనుగుణంగానే ఈసీ ఎన్నికలను నిర్వహిస్తోందని మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ గెలిచిన అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలోని అవకతవకలను బయటపెట్టామని రాహుల్ గాంధీ చెప్పారు. వారి స్వార్థం కోసం ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించేలా కేంద్రం చట్టాలను తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. పోలింగ్ తర్వాత 45 రోజులకు సీసీ ఫుటేజీ ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఓట్ల చోరీకి సంబంధిచిన ఆధారాలన్నీ ప్రజల ముందుకు తీసుకువచ్చినప్పటికీ ఇప్పటి వరకు వాటిపై ఈసీ తమకు సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. హరియాణా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన మోడల్‌కు 23 ఓట్లు ఉన్న అంశాన్ని ఆయన మళ్లీ గుర్తు చేశారు. మన దేశం 150 కోట్ల ప్రజలతో కుట్టిన వస్త్రమన్న రాహుల్, దాన్ని ఓట్లతో కలిపి అల్లారని చెప్పుకొచ్చారు. ఓట్ల చోరీకి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య నాశనం కోసం ఈసీని బీజేపీ వాడుకుంటోందని, పథకం ప్రకారమే ఈసీ ఎంపిక ప్యానల్ నుంచి సీజేఐను తొలగించారని వివరించారు.

# అమిత్ షా వర్సెస్ ఖర్గే

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో వందే మాతరం గీతం ప్రాముఖ్యాన్ని హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా వివరిస్తూ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ గీతం 150 ఏళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని జరిగిన చర్చపై కొన్ని పార్టీలు వ్యక్తం చేసిన అనుమానాలకు సమాధానాలిచ్చారు. అప్పట్లో వందేమాతరం పాడిన వారిని ఇందిరా గాంధీ జైలులో పెట్టారని అమిత్ షా ఆరోపించారు.

**వందే మాతరం ప్రభావం ఒక్క రాష్ట్రానికే పరిమితం కాదు!**


వందే మాతరం భారతీయుల దేశభక్తి భావనకు ప్రతీక, జాతీయ సంస్కృతి, జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించే అమర సృజన అని అమిత్ షా తెలిపారు. ప్రత్యేక చర్చను బంగాల్ అసెంబ్లీ ఎన్నికలతో అనుసంధానం చేయడం తప్పని స్పష్టం చేశారు. బంకిం చంద్ర చట్టోపాధ్యాయ బంగాల్‌కు చెందినవారు అయినా, వందే మాతరం ప్రభావం ఒక్క రాష్ట్రానికే పరిమితం కాలేదని చెప్పారు. మొత్తం దేశాన్ని, విదేశాల్లోని స్వాతంత్ర్య సమరయోధులను కూడా ప్రేరేపించిందని పేర్కొన్నారు. “ఈ రోజు కూడా సరిహద్దుల్లో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసే సైనికుల చివరి మాట వందే మాతరమే” అని అమిత్ షా అన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవం పెంపొందేలా యువతకు, రాబోయే తరాలకు దీని చరిత్రను, భావజాలాన్ని అవగాహన చేయడం కీలకమని తెలిపారు. వందే మాతరం స్ఫూర్తి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గదర్శకం అవుతుందని అన్నారు.

**ప్రతిపక్ష విమర్శలకు సమాధానం**

ఈ చర్చను బంగాల్ ఎన్నికలతో అనుసంధానిస్తున్న ప్రతిపక్షాలపై స్పందిస్తూ, “ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారు తమ ఆలోచనను మరోసారి పునరాలోచించాలి. దేశభక్తిని రాజకీయ కళ్లజోడుతో చూడకూడదు” అని షా తీవ్రంగా విమర్శించారు. వందే మాతరం గీతం స్ఫూర్తి గతంలో అందించిన శక్తి భవిష్యత్తులో కూడా భారత అభివృద్ధికి దారితీస్తుందని అన్నారు.

**బ్రిటిషర్లతో కలిసి పనిచేశారు: ఖర్గే విమర్శలు**

ఆ తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వం, ముఖ్యంగా బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “1921లో మహాత్మా గాంధీజీ





సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించగా, వేలాది మంది కాంగ్రెస్ స్వాతంత్ర్య సమర వీరులు వందే మాతరం నినాదాలు చేస్తూ జైళ్లకు వెళ్లారు. కానీ అప్పటి మీ సిద్ధాంత పూర్వీకులు ఎక్కడ ఉన్నారు? వారు బ్రిటిషర్లతో కలిసి పనిచేశారు. మీ చరిత్ర అదే” అని ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీ తరచూ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని, అమిత్ షా కూడా అదే ధోరణిని అనుసరిస్తున్నారని ఆయన అన్నారు.

**లోక్‌సభలో 12 గంటలపాటు సాగిన చర్చ**

వందే మాతరం 150 ఏళ్ల ప్రయాణంపై లోక్‌సభలో సోమవారం జరిగిన ప్రత్యేక చర్చ దాదాపు 12 గంటలు కొనసాగింది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని గీతం స్వాతంత్ర్య సమరంలో పోషించిన పాత్రను వివరించారు. బీజేపీ, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం విమర్శలు చేసుకున్నప్పటికీ, గీతం దేశ చరిత్రలో ఉన్న ప్రాముఖ్యంపై అంగీకారం వ్యక్తమైంది.

**వందే మాతరంఏ150 ఏళ్ల ప్రయాణం**

1875 నవంబర్ 7న బంకిం చంద్ర చట్టోపాధ్యాయ గారు బంగదర్శన్ పత్రికలో వందే మాతరంను మొదట ప్రచురించారు. అనంతరం 1882లో ఆయన రచించిన ఆనందమఠంలో ఈ గీతాన్ని చేర్చారు. రవీంద్రనాథ్ ఠాగూర్ దీనికి స్వరపరిచారు. స్వాతంత్ర్య సమరంలో వందే మాతరం ఒక నినాదంగా, దేశాన్ని ఏకం చేసిన శక్తిగా నిలిచింది. 2024 నవంబర్ 7న 150వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు జరిగాయి.

18వ లోక్‌సభ 6వ సెషన్, రాజ్యసభ 269వ సెషన్‌లు డిసెంబర్ 1న ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 19తో ముగియున్నాయి. ఈ నేపథ్యంలో వందే మాతరం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రత్యేక చర్చలు జరిగాయి. దేశభక్తి భావనను పునరుద్ధరించేలా పార్లమెంటు వేదికగా జరిగిన ఈ చర్చ దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది.

## సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు

**న్యూ ఢిల్లీ** : కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు ఇచ్చింది 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే అంటే 1980 లో సోనియా గాంధీ ఓటు హక్కు పొందారని మోసం, ఫోర్జరీ ద్వారా ఓటు హక్కు పొందిన ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు సమాధానం చెప్పాలని కోర్టు నోటీసుల్లో పేర్కొంది. సోనియా గాంధీతోపాటూ ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది.సోనియాగాంధీ 1983 ఏప్రిల్ 30న భారత పౌరసత్వం పొందిన విషయం తెలిసిందే. అయితే, అంతకు ముందే అంటే 1980లోనే ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేర్చారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీకి చెందిన న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ అవెన్యూ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ ఏడాది సెప్టెంబర్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు సరైన ఆధారాలు లేవని ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో కోర్టు తీర్పును సవాల్ చేస్తూ న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రౌస్ అవెన్యూ కోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ మేరకు పౌరసత్వం రాకముందే ఓటర్ల జాబితాలో పేరు ఉండటంపై వివరణ ఇవ్వాలని సోనియా గాంధీకి నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు పంపింది. అనంతరం కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది (2026) జనవరి 6కు వాయిదా వేసింది.ఇటలీలో జన్మించిన సోనియా గాంధీ 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత 1983 ఏప్రిల్ 30న ఆమె భారత పౌరసత్వాన్ని అధికారికంగా స్వీకరించారు. అయితే, పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే అంటే 1980లోనే ఆమె పేరు ఓటర్ల జాబితాలో ఉంది. అయితే, ఈ విషయంపై 1982లో నిరసనలు వ్యక్తమవ్వడంతో ఆమె పేరును తొలగించారు. 1983 జనవరిలో తిరిగి చేర్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం మంజూరైంది.

## మిమ్మల్ని నిరాశపరిచాం...
## క్షమాపణలు కోరుతున్నా



ప్రయాణికులను తీవ్రంగా నిరాశపరిచినందుకు క్షమాపణలు కోరుతున్నామని ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. ఇండిగో కొన్ని రోజులుగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. సర్వీసుల రద్దు ఈ రోజు కూడా కొనసాగినప్పటికీ, పరిస్థితులు గాడిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంక్షోభంపై సీఈవో స్పందించారు. సంక్షోభం తర్వాత ఇండిగో మళ్లీ తన కాళ్లపై నిలబడిందని ఆయన తెలిపారు. తమ వైఫల్యం కారణంగా ప్రయాణికులను తీవ్రంగా నిరాశపరిచినందుకు చింతిస్తున్నామని పేర్కొన్నారు. వివిధ కారణాలతో ప్రయాణాలు చేస్తుంటారని, సంక్షోభం కారణంగా వేలాది మంది తమ ప్రయాణాలను కొనసాగించలేకపోయారని, ఇందుకు హృదయపూర్వక క్షమాపణలు కోరుతున్నానని పేర్కొన్నారు.లక్షలాది మంది ప్రయాణికులు రిఫండ్లను పొందినట్లు గుర్తుచేశారు. మిగిలిన ప్రయాణికులకు కూడా రిఫండ్ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన వారి లగేజీని ఇంటి వద్దకు చేర్చామని అన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నిన్నటి నుంచి వందకు పైగా గమ్యస్థానాలకు ఇండిగో సర్వీసులు ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రభుత్వానికి తమ సహకారం అందిస్తున్నామని అన్నారు. తాము విమానాల రద్దును నివారించలేకపోయామని, తమ ఇండిగో బృందం కష్టపడి పని చేస్తుందని హామీ ఇస్తున్నామని అన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడం తమ ముఖ్య ప్రాధాన్యత అని అన్నారు. సంక్షోభం ఉన్నప్పటికీ తమ సేవలను వినియోగించుకుంటున్నారని, విమానాలను బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. ఇది తమకు ప్రోత్సాహకరంగా ఉందని, తాము తప్పుల నుంచి పాఠాలను నేర్చుకున్నామని అన్నారు. ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందో అధ్యయనం చేస్తున్నామని ఆయన తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రతి రాష్ట్రంలో కొనసాగాల్సిందే

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా కొనసాగించాల్సిందేనని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఆ సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నిర్వహణలో ఎదురవుతోన్న పరిస్థితులను పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగమైన బీఎల్ఓ (బూత్ లెవల్ అధికారులు), ఇతర అధికారులకు బెదిరింపులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిని తమ దృష్టికి తీసుకురావాలని లేకపోతే గందరగోళ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. బీఎల్ఓలకు బెదిరింపులు వస్తే, ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వారి భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. బీఎల్ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి పరిష్కార మార్గాలను అనుసరించాలని సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు ఏర్పడినా అధికారులను రక్షించడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం కోర్టుకు తెలియజేసింది.

**పోలీసులను వాడతాం!**

రాకేశ్ ద్వివేదీ తన వాదనలు వినిపిస్తూ, ‘పరిస్థితి మరింత తీవ్రమైతే, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని పోలీసులను తమ డిప్యుటేషన్ కిందకు తీసుకురావడం తప్ప ఈసీకి మరో మార్గం లేదని’ అన్నారు. అయితే ‘ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు పోలీసులను ఈసీ తన అధికార పరిధిలోకి తీసుకోలేదని’ జస్టిస్ బాగ్చి స్పష్టం చేశారు. దీనితో ‘ఎస్ఐఆర్ విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, ఇతర అధికారులను బెదిరింపులకు గురిచేసినప్పుడు, అలాంటి సమస్యలను పరిష్కరించడానికి ఎలక్షన్ కమిషన్?కు అన్ని రాజ్యాంగ అధికారాలు ఉన్నాయని’ రాకేశ్ ద్వివేది అన్నారు. ‘ఎలాగైనా పరిస్థితులను చక్కదిద్దండి లేకపోతే అది అరాచకానికి దారితీస్తుంది. ఇది తీవ్రమైన సమస్య’ అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇక బంగాల్‌లో తీవ్ర ఒత్తిడికి గురికావడం వల్లే బీఎల్ఓలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనే వాదనను రాకేశ్ ద్వివేదీ తోసిపుచ్చారు. బీఎల్ఓలు ఒత్తిడికి గురవుతున్నారనే ప్రశ్నే లేదని పేర్కొన్నారు. ఎందుకంటే బీఎల్ఓలు రోజుకు 6 లేదా 7 ఇళ్లను, 30 నుంచి 35 మంది ఓటర్ల వివరాలను మాత్రమే తీసుకుంటారని చెప్పారు. దీనితో “బీఎల్ఓలు చేసేది డెస్క్ పని కాదు. వాళ్లు ఇంటింటికీ వెళ్లి, ఎన్యూమరేషన్ ఫారమ్‌లను నింపాల్సి ఉంటుంది. ఆపై దానిని అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇది పైకి కనిపించేంత సులభమైన పనికాదు” అని జస్టిస్ బాగ్చి అన్నారు. ఇక పిటిషనర్ సనాతని సంసద్, ఇతరుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వి.గిరి తన వాదనలు వినిపిస్తూ, ఎస్ఐఆర్ పని చేస్తున్న బీఎల్ఓలను, ఇతర అధికారులను హింసిస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతేకాదు వారిని రక్షించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధించేలా విజన్ డాక్యుమెంట్

-మొదటిపేజీ తరువాయి

పేదలు, రైతులు, వ్యాపారులు, యువతకు అభివృద్ధి ఫలాలు దక్కేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఆనంద్ మహీంద్ర, చిరంజీవి, దువ్వూరి సుబ్బారావు పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో రికార్డుస్థాయిలో ఒప్పందాలు జరిగాయి. సమిట్ రెండురోజుల్లో కలిపి మొత్తం రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు వివిధ కంపెనీలు, పరిశ్రమలు ప్రభుత్వంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్ గ్లోబల్ సమిట్ ముగింపు దశకు చేరుకుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి వరుస సమావేశాలు నిర్వహిస్తూ బిజీ బిజీగా గడుపారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఇప్పటి వరకు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సమావేశం అయ్యారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై ఫిరోజ్‌షా గోద్రెజ్ సీఎంతో చర్చించారు. పాలు, ఎఫ్‌ఎంసీజీ, రియల్‌ఎస్టేట్, ఆయిల్‌పామ్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఆసక్తి చూపిస్తుంది. మరోవైపు సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.

భారత్ బయోటెక్ రూ.1000 కోట్ల పెట్టుబడి : రాష్ట్రంలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్? బయోటెక్? ఇంటర్నేషనల్? సంస్థ ముందుకు వచ్చింది. కాంట్రాక్ట్? రీసెర్చ్?, డెవలప్?మెంట్? అండ్? మ్యానుఫ్యాక్చరింగ్? ఆర్గనైజేషన్?(సీఆర్?డీఎంవో) నిర్మాణానికి రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో దీని ద్వారా 200 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

**ఇప్పటివరకూ రూ.2.96 లక్షల కోట్ల ఒప్పందాలు**



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో రెండోరోజు ఇప్పటివరకు రూ.2.96 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇలా పలు ఒప్పందాలు జరుగుతున్నాయి. తెలంగాణలో డెయిరీ విస్తరణ కోసం గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో ఒక ఒప్పందం జరిగింది. రెండు దశల్లో రూ.2 వేల కోట్ల పెట్టుబడులను ఫెర్టిస్ ఇండియా పెట్టనుంది.

ఫుడ్ అండ్ బేవరేజెస్ యూనిట్-2 విస్తరణకు కేజేఎస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఫ్రీజ్-డ్రైడ్ కాఫీ ప్లాంట్ నిర్మాణానికి వింటేజ్ కాఫీ అండ్ బేవరేజెస్ ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డిని అరబిందో, భారత్ బయోటెక్ ప్రతినిధులు కలిశారు. అలాగే హెటెరో, ఎంఎస్ఎన్ ఫార్మా ప్రతినిధులు కలిశారు. ఈ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నాయి.

**పలు కంపెనీలు, పరిశ్రమలతో ఒప్పందాల వివరాలు ఇవే :**

ఫుడ్ అండ్ ఎఫ్ఎంసీజీ తయారీ యూనిట్‌కు ఆర్‌సీపీఎల్ ఒప్పందం

ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యానుఫాక్చరింగ్ సేవల విస్తరణకు కైన్స్ టెక్నాలజీ ఒప్పందం

రూ.9 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో జేసీకే ఇన్‌ఫ్రా ఒప్పందం

మూడు దశల్లో ఆర్‌సీటీ ఎనర్జీ ఇండియా రూ.2,500 కోట్ల పెట్టుబడులు

50 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ డేటా సెంటర్‌కు అక్విలోన్ నెక్సస్ ఒప్పందం

హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌కు ఏజీపీ గ్రూప్ ఒప్పందం

రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న ఏఐ-రెడీ డేటా పార్క్

ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్న హెటెరో గ్రూప్

రాష్ట్రంలో రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న అరబిందో ఫార్మా

పెప్టైడ్స్ తయారీ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యూల్స్ ఇండియా

వ్యాక్సిన్, ఆర్అండ్‌డీ, సీడీఎంవో విస్తరణకు బయోలాజికల్-ఈ ఒప్పందం

రెండోరోజు పర్యాటకరంగంలో రూ.11,395 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

## మీరు ఊరికి వస్తే చాలు, మిగతావన్నీ మేము చూసుకుంటాం

# ఓటర్ల ప్రసన్నం కోసం కాసుల వర్షం

పల్లెల్లో స్థానిక పోరు వేడి ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఏ గ్రామంలో చూసిన ఎన్నికల గురించే చర్చ నడుస్తోంది. అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు ప్రచారాన్ని సాగిస్తున్నారు. మొదటి విడత ప్రచారానికి ఇవాళ ఒక్కరోజే సమయం ఉండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని జోరందుకున్నారు. ఈ జోరు మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో కొనసాగుతోంది. ఏకగ్రీవాలు మినహా మిగతా చోట్ల పోలింగ్? గురువారం జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం నుంచి ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధిరీత్యా వలస వెళ్లిన ఓటర్లపైనా ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాంటి వారిని పోలింగ్? కేంద్రాల వరకు రప్పించేందుకు అభ్యర్థులు ప్రత్యేకంగా రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. మీరు ఊరికి వస్తే చాలు, మిగతావన్నీ మేం చూసుకుంటాం అనే హామీ వారికి ఇస్తున్నారు.

మొదటి విడత ఎన్నికలు జరిగే ఏ పల్లెకి వెళ్లిన పట్టణాల్లో ఉన్న మనవాళ్లు ఎప్పుడొస్తున్నారు? అనే ప్రశ్నలు, చర్చనే జరుగుతోంది. అభ్యర్థులు తమ అనుచరులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామం నుంచి పట్టణాలకు వెళ్లినవారి జాబితాలు రూపొందిస్తున్నారు. ఫోన్?నంబర్లు సేకరించి సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకుని వారిని పలకరించే పనిలో పడ్డారు.

దూర ప్రాంతాల్లో ఉన్నవారు సొంత ఖర్చులతో రావడానికి వెనకాడతారని భావించి అభ్యర్థులు వారికి అదిరిపోయే ఆఫర్లు ఇస్తున్నారు. ప్రాంతాల ప్రకారం ప్రైవేటు బస్సులు, కార్లును ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రయాణానికి అయ్యే మొత్తంతో పాటు దారి ఖర్చులను భరిస్తున్నారు. ఊరికొచ్చిన ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు సైతం కల్పిస్తున్నారు.

కొణిజర్ల మండలంలోని ఓ గ్రామ పంచాయతీ నుంచి ఎక్కువ




మంది ఉపాధి కోసం వివిధ పట్టణాలు, నగరాలకు వలస వెళ్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ మొత్తం 1,124 మంది ఓటర్లకు గాను 250 మంది ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు అభ్యర్థులు గుర్తించారు. వలస వెళ్లిన ఓటర్లు ఎటువైపు మళ్లితే వారు విజయం సాధించే అవకాశమే ఎక్కువగా ఉంది. అందుకే అలాంటి ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు అభ్యర్థులు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. పోలింగ్? రోజు కంటే ముందే ఊరికొచ్చేలా ఏర్పాటు చేస్తామని అభ్యర్థులు హామీ ఇస్తున్నారు. ఓటు మన ఊరికి, అభివృద్ధి మీ ఇంటికి అనే నినాదంతో పట్టణాల్లో ఉంటున్న ఓటర్లను వారు ప్రసన్నం చేసుకుంటున్నారు.

కొన్నిచోట్ల ప్రచారం, అనుచర గణం, గ్రామంలోని ఓటర్లకు అయ్యే ఖర్చు కన్నా ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను స్వస్థలాలకు రప్పించేందుకే ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తుండటం ఇక్కడ గమనార్హం.

మరికొన్ని ప్రాంతాల్లో విభిన్న రీతుల్లో అభ్యర్థులు ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఓటర్లను వివిధ ప్రాంతాల నుంచి రప్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు. వారి గురించి ప్రత్యేకంగా అభ్యర్థులు వారికి నమ్మకమైన మనుషులను పట్టణాలకు పంపించి అక్కడి వారిని తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

## శంషాబాద్‌లో ప్రయాణికుల కష్టాలు ఇంతింతకాదయా

**హైదరాబాద్ :** మీ చావు మీరు చావండి.. మేమింతే.. మా తీరింతే.. అంటూ ఇండిగో సంస్థ విమాన ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. ఇండిగో సంక్షోభం మొదలై రోజులు గడుస్తున్నా, నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజా ఇతర ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయం రావాల్సిన 58 , ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన 54 ఇండిగో సర్వీసులు రద్దుకావడంతో రోజుల తరబడి శంషాబాద్‌లోనే ప్రయాణికులు పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇండిగో సంక్షోభం మొదలైన నాటి నుంచి నేటివరకూ వేల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.గంటల తరబడి శంషాబాద్‌లో ఎయిపోర్టులో వేచి ఉండాల్సిన పరిస్థితులు రావడంతో చేతిలో సెల్ ఫోన్ స్క్రీన్‌లను చూసీ, చూసి అలసిపోతున్న పరిస్థితి నెలకొంది. సమయం గడవాలంటే ఫోన్ చూడక తప్పదు. అలా ఫోన్ ఫోబియా శంషాబాద్ ఎయిర్పోర్టులో ప్రయాణికులకు వెంటాడుతోంది.ఇలా శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రయాణికుల అవస్థలు పీక్స్ కు చేరుకున్నాయి. ఎయిర్ పోర్టుకు వచ్చేవరకూ విమాన సర్వీసుల రద్దు విషయం కనీసం ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండిగో కష్టాలపై వారిమాటల్లోనే..మణికంఠ, ప్రయాణికుడు..: నేను హైదరాబాద్ నుంటి కోల్‌కతా వెళ్లాలి. ఉదయం నుంచి ఇక్కడే ఎదురు చూస్తున్నాను. ఇక్కడ సిబ్బందిని అడిగితే సరైన స్పందన లేదు. ఫ్లైట్ రద్దు అయ్యాయి అని మాత్రమే చెబుతున్నారు. తిరిగి రీషెడ్యూల్ చేయమని అడిగితే , మాకు ముందస్తు సమాచారం లేదని చెబుతున్నారు. గంటల తరబడి ఇక్కడే ఎదురు చూస్తున్నాం. కనీసం తిండిలేదు. తాగేందుకు మంచినీళ్లు కూడా సరఫరా చేయడంలేదు. దేశంలో ఆన్ టైమ్‌లో నడిచే పెద్ద సంస్థ ఇండిగో. మరి ఇటువంటి సంస్థ ఇలా చేస్తే, ఇంకా ఎవరిని నమ్మాలి. కనీసం ఫ్లైట్ రద్దు విషయం మాకు ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. తీరా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన తరువాత తెలిసి, చేసేదిలేక ఇక్కడే పడిగాపులు పడుతున్నాం. కనీసం ఈరోజు ఏ టైమ్ లోనైనా మరో ఫ్లైట్ ఏర్పాటు చేయమని అడిగితే ఇక్కడ సిబ్బంది స్పందించడంలేదు. నేను 400 కిలోమీటర్లు , 12 గంటలు ప్రయాణించి ఫ్లైట్ కోసం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటే తీరా వచ్చాక వీళ్లు చావుకబురు చల్లగా చెబుతున్నారు.నేను కల్‌కతా వెళ్లి అక్కడ వియత్నాంకు కనెక్టింగ్ ఫ్లైట్ పట్టుకోవాలి. అవి రెండూ రద్దు కావడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. డబ్బులు కట్ చేసుకుంటున్నప్పుడు ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇచ్చే కనీస బాధ్యత లేదా., టిక్కెట్ అమౌంట్ రీఫండ్ కోసం 6 రోజులు వేచి ఉండాలని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మరో ఫ్లైట్ ఎలా బుక్ చేసుకోవాలి. ఇదే అవకాశంగా ఇతర విమాన సర్వీసులు టిక్కెట్ రేట్లు 7 నుంచి 8 రెట్లు అదనంగా వసూలు చేస్తున్నారు.,ప్రయాణికుడు..: నిన్న రాత్రి నా ఫ్లైట్ రద్దైయ్యింది. ఇప్పటికి 24 గంటలు సమయం గడిచినా ఓ క్లారిటీ రాలేదు. చేసేది లేక అదనపు భారమైనా భరించి మరో ఫ్లైట్ బుక్ చేసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 12 గంటలు దాటితే స్టే చేసిన హోటళ్లు సైతం వెకేట్ చేయాలని చెప్పేస్తున్నారు. చేసేదిలేక ఇలా ఎయిర్పోర్టు నుంచే ఆఫీస్ వర్క్ చేయాల్సిన వస్తోంది. ఇక్కడ చిన్నపిల్లలు, వృద్దుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.రాహుల్ , ప్రయాణికుడు..: నేను ఉదయం ఫ్లైట్ రద్దైనట్లు మేసేజ్ రిసీవ్ చేసుకున్నాను. అత్యవసర పని వల్ల నేను తిరిగి మరో ఫ్లైట్ ఏర్పాటు చేస్తారని, శంషాబాద్ ఎయిర్ పోర్టు వచ్చాను. కానీ ఇక్కడ సిబ్బంది నుంచి ఎటువంటి స్పందన లేదు. నేను శంషాబాద్ నుంచి బెంగుళూరు వెళ్లాల్సి ఉంది. ఇక్కడ ప్రభుత్వం బెంగుళూరు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేసింది. కానీ అవి ఏ సమయంలో బయలుదేరుతాయనేది క్లారిటీ ఇవ్వడంలేదు.

## ఫ్యూచర్ సిటీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని సౌకర్యాలు

-మొదటిపేజీ తరువాయి

కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సినీ ప్రముఖులకు వివరించారు. 24 క్రాఫ్ట్‌లో సినిమా ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని వారికి సీఎం సూచించారు. స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డిని తెలుగు అగ్ర కథానాయకుడు చిరంజీవి కలిశారు. ఆయన గ్లోబల్ సమిట్ వద్దకు హెలికాప్టర్‌లో వచ్చారు.

ఫిల్మ్ స్టూడియో నిర్మాణం : ఫ్యూచర్ సిటీలో సినిమా స్టూడియో నిర్మాణానికి బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ముందుకు వచ్చారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రపంచస్థాయి సినిమా స్టూడియో నిర్మాణానికి ప్రభుత్వంతో చర్చలు జరిపారని వెల్లడించారు. ఆలోచనలు, ఆవిష్కరణలతో వచ్చేవారిని తెలంగాణ ప్రభుత్వం సాదరంగా ఆహ్వానిస్తోందన్న మంత్రి కోమటిరెడ్డి చిత్ర పరిశ్రమ గురించి చర్చించేందుకు వచ్చిన సినీ ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు.

**సీఎం బీజీ బీజీగా**

గ్లోబల్ సమిట్‌లో రెండోరోజు రికార్డుస్థాయిలో ఒప్పందాలు కుదురుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వంతో వివిధ కంపెనీలు, పరిశ్రమలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు అమితాసక్తిని చూపిస్తున్నాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు.

భారీ స్థాయిలో రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్న ఏఐ-రెడీ డేటా పార్క్

రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న అరబిందో ఫార్మా సంస్థ

పెప్టైడ్స్ తయారీ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యుల్స్ ఇండియా కంపెనీ

భారత్ బయోటెక్ పెట్టుబడి : తెలంగాణలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంవో) నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు పెట్టుబడిని పెట్టబోతుంది. వచ్చే నాలుగేళ్లలో 200 మందికిపైగా ఉద్యోగాలు రానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఎమ్?ఓయూ కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రెండు దశల్లో ఫెర్టిస్ ఇండియా రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది.

## కేసీఆర్ అంటే పోరాటం.. రేవంత్ అంటే వెన్నుపోటు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు.. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. 'డిసెంబర్ 9 అనేది చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. నవంబర్ 29న దీక్షా దివస్ జరుపుకున్నాం. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన లేదు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం లేదు. తెలంగాణ ఉద్యమంలో ఈ 3 రోజులు చాలా కీలకమైనవి.

నిమ్స్‌లో కేసీఆర్ 11 రోజులు ఆమరణ దీక్ష దేశారు. కేసీఆర్ దీక్ష ఫలితం డిసెంబర్ 9న ప్రకటన వచ్చింది. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా?. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా?. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితం తెలంగాణ రాష్ట్రం. దీక్ష లేకపోతే తెలంగాణ ప్రకటనే రాదు. ప్రకటన వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, దీక్ష ఫలితం. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం. రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం. రాజీనామాలు చేయాలంటే జీరాక్స్‌లు ఇచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి. జై తెలంగాణ అంటే తుపాకీతో కాలుస్తా అని రైఫిల్ పట్టుకున్న వ్యక్తి రేవంత్. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు.

ఈ రోజు తెలంగాణ తల్లిని మారుస్తున్నారు. రేవంత్ సృష్టించిన తల్లిని పెడుతున్నారు. తెలంగాణ ఉద్యమం, భావోద్వేగాల మధ్య పుట్టిన తల్లి తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లిని ఊరూరా ప్రజలే పెట్టుకున్నారు. తెలంగాన ఉద్యమంలో పుట్టిన తల్లిని మార్చే హక్కు రేవంత్‌కు లేదు. రేవంత్ తెలంగాణ ప్రజల తలరాతలు మారుస్తా అన్నాడు. ప్రజల తలరాతలు మార్చలేదు కానీ, తెలంగాణ తల్లిని మాత్రం మార్చాడు. ఎరువులు, విత్తనాల కొరత సృష్టించాడు. ధరలు పెంచాడు. రైతుబంధు ఎగ్గొట్టాడు. రైతుబీమాకు డబ్బులు కట్టలేదు. మహిళలను ఆగం చేశాడు. రాష్ట్రాన్ని ఆగం చేశాడు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నాడు. రవీంద్రభారతి అవార్డుల కంటే రామోజీ ఫిలింసిటీ అవార్డు గొప్పదని అంటున్నాడు. రవీంద్రభారతిలో దాశరథి, కాళోజీ, గద్దరన్న అవార్డులు ఇస్తారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి. హైదరాబాద్‌కు ట్రంప్ రోడ్డు అని పేరు పెడుతాడంటా. తెలుగు పిల్లలను జైళ్లలో వేసినందు ట్రంప్ పేరు పెడతావా?. మన దేశాన్ని ఇబ్బంది పెట్టి వ్యాపార సంస్థలు మూతపడి, పిల్లల ఉద్యోగాలు ఊడగొట్టినందుకు ట్రంప్ పేరు పెడుతావా?. హైదరాబాద్ పిల్లలు ఉద్యోగాలు రాక అమెరికాలో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ట్రంప్ ఫీజులు పెంచారు. రేవంత్ రెడ్డి నాడు సోనియా గాంధీని బలి దేవత అన్నాడు. 500 మంది పిల్లల చావుకు కారణం సోనియా అన్నాడు. అప్పుడు బలిదేవత.. ఇప్పుడు దేవత అంటున్నాడు. సోనియమ్మ ఇచ్చిన తెలంగాణను వెనక్కి తీసుకున్నందుకు డిసెంబర్ 23న తెలంగాణ విద్రోహ దినం జరుపుకోవాలి' అని హరీశ్ రావు విమర్శించారు.

## విందిస్తాం ఓటేయండీ

-మొదటిపేజీ తరువాయి

స్వయంగా వెళ్లి విందులు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం ఏకంగా మినీ ఫంక్షన్? హాళు,, కమ్యూనిటీ భవనాలను వినియోగిస్తున్నారు. గ్రామానికి వచ్చి ఓటు వేసి, తిరిగి రావడానికి అయ్యే ఖర్చులను కూడా డిజిటల్ రూపంలో ఓటర్లకు చెల్లిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మండలంలోని ఓ పల్లెలో మొత్తం 1,214 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు 600 మంది హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. ఈ ఓటర్ల నమ్మకాన్ని కూడగట్టుకునేందుకు సర్పంచ్? బరిలో నిలిచిన ఓ అభ్యర్థి శనివారం రాత్రి హైదరాబాద్?లోనే విందుకు ఏర్పాటు చేశారు. చండూరు మండలంలోని ఓ గ్రామ సర్పంచి అభ్యర్థి కూడా మూడు రోజుల క్రితం హయత్‌నగర్‌లో తమ ఊరి ఓటర్లకు మటన్, చికెన్, మందుతో దావత్ ఇచ్చాడు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో : ఈ దావత్?ల సందడి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లోని చాలామంది హయత్?నగర్ నుంచి దిల్?సుఖ్?నగర్ వరకు నివాసం ఉంటున్నారు. భువనగిరి వాసులు వరంగల్ హైవే వెంట ఉప్పల్, హబ్సిగూడ ఏరియాల్లో ఉన్నారు. అలాగే దేవరకొండకు చెందిన ఓటర్లు నాగార్జున సాగర్ హైవే వెంట బీఎన్?రెడ్డి ప్రాంతంలో ఎక్కువగా నివసిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో ఈ దావత్?లు జోరుగా సాగుతున్నాయి.

గ్రామాల్లో సరైన ఉపాధి లేక ఎంతో మంది ప్రజలు హైదరాబాద్?కి వలస వస్తుంటారు. వారిలో ఎక్కువమంది తమ ఓటు హక్కును సొంత గ్రామాల్లోనే కలిగి ఉంటారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే కావడంతో, అభ్యర్థులు ఎవ్వరినీ వదిలి పెట్టకుండా, నగరానికి వచ్చి ఓటర్లతో సంప్రదింపులు జరిపి, విందులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పంచాయతీ ఎన్నికల సందడి హైదరాబాద్? నగరానికీ వ్యాపించింది.

గతంలో ఎంపీగా పోటీ, ఇప్పుడు వార్డు సభ్యుడి కోసం : ఈ అభ్యర్థి ఒకసారి పార్లమెంట్? నియోజక వర్గ స్థానానికీ, రెండు సార్లు అసెంబ్లీ శాసన సభ్యుడిగా పోటీ చేసిన నాయకుడు. కానీ, ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా పోటీ చేస్తుండటం సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలోని వంజరుపల్లికి చెందిన మోర్తాల చందర్?రావు 2004లో వరంగల్ ఎంపీ అభ్యర్థిగా, 2008లో శాయంపేట, 2009లో పరకాల శాసన సభ నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో వంజరుపల్లిలో సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించగా, ఈ వర్గానికి చెందిన వారు గ్రామంలో ఎవరూ లేకపోవడంతో చందర్?రావు వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నారు. గెలిస్తే ఉప సర్పంచి పదవి పొంది గ్రామాన్ని పాలించవచ్చనే లక్ష్యంతో ఆయన వార్డు సభ్యుడిగా పోటీలో నిలిచారు.

# సంపాదకీయం

## ప్రభుత్వ రంగంతోనే సమగ్ర అభివృద్ధి

ఇండిగో సంక్షోభం కారణంగా ఇప్పుడు దేశం మొత్తం పబ్లిక్ రంగం ప్రాధాన్యతపై చర్చ మొదలైంది. వేలాదిమంది సోషల్ మీడియాలో పబ్లిక్ రంగం పాత్ర ఈ దేశ విమానయాన రంగంలో పోషించిన నిర్మాణాత్మక పాత్రపై అనేక చర్చలు జరుగుతున్నాయి. పబ్లిక్ రంగం పాత్రను చరిత్రలోనే మనం తొంగిచూస్తే అనేక విజయాలు మనకు కనిపిస్తాయి. భారత దేశంలో పబ్లిక్ రంగం అనేది సాధారణ ఆర్థిక వ్యవస్థలో ఒక రంగం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యపు సామాజిక, ఆర్థిక బలాన్ని నిలబెట్టే స్తంభం. స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే ప్రజల అవసరాలను కేంద్రంగా పెట్టుకున్న ఆర్థిక నిర్మాణం అవసరమైంది. అదే బాధ్యతను పబ్లిక్ రంగం నెరవేర్చింది. బ్యాంకింగ్ నుంచి రైల్వేలు, విమానయానం, కోల్ ఇండియా నుంచి స్టీల్ అథారిటీ వరకు, కోట్లాది ప్రజల ప్రయాణాలు, పొదుపులు, ఉపాధి, జీవన ప్రమాణాలు పబ్లిక్ రంగాలపై ఆధారపడి ఉన్న వాస్తవం. లాభాలను కంటే ప్రజల అవసరాలను ముందుకు పెట్టడం, దూరప్రాంతాలకు సేవలు చేర్చడం, సామాజిక సమానత్వాన్ని చూపించడం ఇవన్నీ పబ్లిక్ రంగం నుంచే సాధ్యమయ్యాయి. కానీ నేడు ఈ రంగం దాడులు పెరుగుతున్నాయి. ప్రైవేటీకరణను అభివృద్ధి అని అమ్మే ప్రభుత్వాలు పబ్లిక్‌రంగ సంస్థలను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నాయి. లాభాల్లో ఉన్న సంస్థలకూ 'స్ట్రాటజిక్ డిస్‌ఇన్వెస్ట్‌మెంట్' పేరుతో వేలం వేయడం సాధారణమైంది. ప్రజల సొమ్ముతో నిర్మించిన సంస్థలను కొంతమంది కార్పొరేట్ వర్గాలకు అప్పగించడం ద్వారా ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థను క్రిమినలైజ్ చేస్తున్నాయి. బ్యాంకులను విలీనాలు, మూసివేతల దిశగా నెట్టడం, బొగ్గు బ్లాకులను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం, రైల్వే, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలను విడదీసి ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడం ఇవన్నీ ప్రజలపై భారాలు మోపే నిర్ణయాలే. ప్రైవేటు రంగం లాభాలను మాత్రమే చూసే క్రమంలో సామాజిక బాధ్యతలు, ధర నియంత్రణ, గ్రామీణ సేవలు అన్నీ అరుదైపోయే ప్రమాదం ఉంది. భారతదేశం లాంటి అసమానతలున్న దేశంలో పబ్లిక్‌రంగం కేవలం వ్యాపారం కాదు. అది సామాజిక సమీకరణ యంత్రాంగం. లాభాలు లేకున్నా సేవలను విరమించకుండా కొనసాగించగల రంగం ఇదొక్కటే. ప్రైవేటీకరణ పేరుతో పబ్లిక్ రంగాన్ని ముసుగులో హరించడం నేరం. ఒక తరానికి చెందిన సొమ్ము, శ్రమ, కలలతో నిర్మించిన ఈ ఆస్తులు దేశ భవిష్యత్తుకు కేవలం పెట్టుబడులు కాదు, రక్షణ. ప్రస్తుత అసమానతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో పబ్లిక్ రంగం బలోపేతం అత్యవసరం. ఉపాధి తగ్గిపోతున్న సమయంలో పబ్లిక్ రంగ విస్తరణ తప్ప మరే ప్రత్యామ్నాయం లేదు. చిన్న, పెద్ద, మధ్యతరగతి ప్రజలందరూ ఆధారపడే భద్రతా వల ఈ రంగమే. కాబట్టి పబ్లిక్ రంగాన్ని రక్షించడం అనేది కేవలం గతాన్ని కాపాడడం కాదు, భవిష్యత్తును కాపాడడం. కానీ పాలకులు ప్రజలకంటే, దేశం అవసరాల కంటే పెట్టుబడి దారుల అవసరాలే మిన్నగా ఉంటున్నాయి. అందుకు ఉదాహరణే ఈ ఇండిగో సంక్షోభం అన్నది వాస్తవం. ఇండిగోలో ఇటీవలే బయటపడిన యాజమాన్య, వాటాదారుల మధ్య అధికార పోరు దేశ విమానయాన రంగం ఎంత అస్థిరంగా మారిందో ప్రత్యక్షంగా చూపిస్తున్న సంఘటన. మార్కెట్‌లో 60 శాతానికి పైగా వాటా ఉన్న సంస్థ ఒక్కరోజు అంతర్గత ఒడిదుడుకులకు లోనైతే దేశవ్యాప్తంగా వేలాది ఫ్లైట్లు రద్దయ్యే ప్రమాదం, ప్రయాణికులు ఇరుక్కుపోయే పరిస్థితి, షేర్ మార్కెట్‌లో కోట్లు ఆవిరయ్యే అనిశ్చితి, ఇవి అన్నీ ఒక్కసారిగా వెల్లువెత్తాయి. ఇది కేవలం ఒక కంపెనీ గొడవ కాదుబీ ఇది విమానయాన రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించిన ప్రభుత్వ విధానాల ఘోర వైఫల్యం. ఆ వైఫల్యాన్ని ప్రశ్నించే ఆలోచనే పాలకవర్గానికిలేదు. ఎయిర్ ఇండియాను భారాలు అవుతున్న పబ్లిక్ రంగం అని తక్కువ చేసి, నష్టాలను ఉద్దేశపూర్వకంగా పెంచిన తరువాత అతి తక్కువ ధరకు ప్రైవేటు చేతుల్లో వదిలేసిన ప్రభుత్వం ఇప్పుడు ఇండిగో సంక్షోభం గురించి పెదవి విప్పడానికి కూడా ముందుకు రావడం లేదు. ఒక పబ్లిక్‌రంగ విమానయాన సంస్థ పనిచేసేది కేవలం లాభాల కోసం కాదుబీ అది జాతీయ అవసరాలను తీర్చే బాధ్యతను కూడా మోసేది. దూరప్రాంతాలకూ, లాభం రానివాటికీ సేవలందించేది. అత్యవసర సమయాల్లో విదేశాల్లో ఇరుక్కున్న భారతీయులను కొలువరించేది. విపత్తుల సమయంలో రక్షణ చర్యల్లో పాల్గొనేది. ఇవన్నీ ప్రైవేట్ రంగం చేయగలదా? వారి బోర్డు సమావేశాల్లో వాటాదారుల ఒత్తిడి ఒక మూలను ఇరుకోబెడితే, ఆ రాత్రే ధరలు ఎగసిపడతాయిబీసేవలు నిలిచిపోతాయి. ఇండిగో సంక్షోభం తర్వాత మార్కెట్ ఎలా స్పందించిందో చూస్తే భారత గగనయాన రంగం అనిశ్చితి ఎంత తీవ్రమో అర్థమవుతుంది. షేర్ ధర పతనంతో పెట్టుబడిదారులు ఆందోళన చెందినా, సాధారణ ప్రజల సమస్య మాత్రం మరింత సూటిగా మెదులుతుంది. ప్రయాణ ఖర్చులు పెరగటం, టికెట్లు అకస్మాత్తుగా దొరక్కపోవటం, సేవా నాణ్యత పడిపోవడం, మార్గాల ఎంపిక పూర్తిగా సంస్థల ఖజాన, లాభాల లెక్కల ఆధారంగా నిర్ణయించబడటం. విమానయాన రంగంలాంటి కీలక రంగాన్ని పూర్తిగా ప్రైవేటుకు అప్పగించడం ఒక దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పే. విమాన రూట్ల కేటాయింపు, అత్యవసర ఎయిర్‌లిఫ్ట్‌లు, అభివృద్ధి చెందని ప్రాంతాలకు కనెక్టివిటీ వంటి సేవలను ప్రైవేట్ కంపెనీలు తమ బ్యాలెన్స్ షీట్‌లను చూసుకుని మాత్రమే నిర్వహిస్తాయి. అలా లాభం రాకపోతే, ఆ సేవలు నిలిచిపోతాయి. పబ్లిక్ రంగం ఉన్నప్పుడు మాత్రం లాభ–నష్టాలతో సంబంధం లేకుండా ప్రజా ప్రయోజనాలే కేంద్రంగా నిలిచేవి. ఇది పబ్లిక్ రంగం ప్రాధాన్యతను సాక్ష్యాలతో రుజువు చేసే ముఖ్యమైన ఉదాహరణ. ఇండిగోలో జరిగిన మేనేజ్‌మెంట్ విభేదాలు, వాటాదారుల మధ్య అధికార యుద్ధాలు, అంతర్గత చెత్త పాలన దేశ విమానయాన రంగంలో ఒకే సంస్థ ఆధీనత ఎలా ప్రమాదకారకమో చూపుతున్నాయి. ప్రైవేట్ సంస్థల అప్రతిహత అధికారం, ప్రభుత్వ మౌన సమ్మతి రెండూ కలిపి ప్రజలకే భారమయ్యాయి. ఒక సంస్థ గందరగోళం కారణంగా దేశవ్యాప్తంగా వందల ఫ్లైట్లు ఆలస్యం కావటం అంటే, కొద్దిమంది పెట్టుబడిదారుల మీద దేశం మొత్తం ఆధారపడి ఉన్నదని అర్థం. ఇది అస్వాభావికమైన ఆర్థిక నిర్మాణం. ఇండిగో సంక్షోభం ఒక సంఘటన కాదు, అది ఒక సందేశం. దేశ విమానయాన రంగాన్ని పూర్తిగా ప్రైవేటు ఆధీనానికి అప్పగించినప్పుడు ఏమి జరుగుతుందో ఇది స్పష్టంగా చెబుతోంది. పబ్లిక్ రంగం మరింత బలపడాల్సిన అవసరం ఉంది. విమానయానాన్ని ప్రజా సేవగా తిరిగి నిర్వచించాల్సిన సమయం వచ్చింది. అప్పుడే ప్రజల ప్రయాణం సురక్షితం, అందుబాటు, సమానత్వం కలిగినదిగా ఉంటుంది. లేకపోతే ఇండిగో నేటి సంక్షోభం రేపటి మరింత పెద్ద దుర్ఘటనలకు పునాది మాత్రమే అవుతుంది.

## తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ కారకులు రావిచెట్టు రంగారావు

నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో చాలా మందికి తెలియదు. అప్పటి రాంకోఠిలోగల రావిచెట్టు రంగారావు బంగాళాలో స్థాపించడం జరిగింది. నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్వంచ, భద్రాచలం సంస్థానా ధిపతి రాజా పార్థసారథి అప్పారావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షుడుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. మరునాటి నుంచే రంగారావు తెలుగు గ్రంథాలయ ఆవశ్యకతను తెలుగు ప్రజానీకానికి వివరించి చెబుతూ, మంచి గ్రంథాల సేకరణకు ఉపక్రమించారు. 1897 సంవత్సరంలో రంగారావు కొందరు మరాఠీ మిత్రుల సహకారంతో చతుర్వేదములు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణములు, కావ్యాలు, నాటకాలు, ఇతర సంస్కృత గ్రంథాలతో కూడిన 'శ్రీ శంకర భగవద్ పూజ్య పాద గీర్వాణ మంజూష' అనే గ్రంథాలయాన్ని తమ ఇంటిలోనే నిర్వహించేవాడు. తొలుత కొంతకాలం తమ బంగళా లోనే నిర్వహించబడ్డ భాషా నిలయానికి రావిచెట్టు సహధర్మచారిణి లక్ష్మీ నరసమ్మ సేవలను అందించేది. ఆమెనే శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయముకి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళ మివ్వగా, ఆ డబ్బుతో ఇప్పుడు సుల్తాన్ బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం విశేషం. రావిచెట్టు రంగారావు (డిసెంబర్ 10, 1877 – జూలై 3, 1910) తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రముఖులు. రంగారావు 1877, డిసెంబర్ 10 న నరసింహారావు, వేంకమాంబ దంపతులకు నల్లగొండ జిల్లా, దండంపల్లి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించారు. ఆయన వివాహం 13వ యేట లక్ష్మీ నరసమ్మతో జరిగింది. తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు మొత్తం రంగారావుకు సంక్రమించగా, తండ్రి నుంచి సంక్రమించిన 'మున్సబుగిరి' స్వీకరించి 'మున్సబుదారు' అయ్యారు. తెలుగుతో పాటు హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, సంస్కృతం భాషలు నేర్చుకున్నారు. తెలుగంటే వారికి వల్లమాలిన అభిమానం. మత, సాంఘిక, రాజకీయాల్లోనూ వారికి సరైన అవగాహన ఉండేది. రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుతో కలసి శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, పిమ్మట విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. సంస్కృత భాషపై ఆయనకు ఎనలేని గౌరవం. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల



సౌకర్యార్థం ఉంచారు. ఆ గ్రంథాలయం తాలూకు రెండువేల రూపాయల విలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే స్థాపించ బడింది. దాదాపు ఐదేండ్లపాటు కార్యదర్శిగా ఉన్నారు. ఎందరో దాతలవద్దకు వెళ్ళి చందాలు వసూలు చేసి, ఆరువందల రూపాయలు నిలువ చేశారు. హైదరాబాద్ లో శ్రీకృష్ణదేవరాయల పేరిట గ్రంథాలయం స్థాపించినట్టే, 1904 జనవరి 26న రాజా నాయిని వెంకటరంగారావు బహద్దూర్ సహకారంతో హనుమకొండ లో 'రాజరాజ నరేంద్ర' గ్రంథాలయాన్ని 1904 లో స్థాపించారు. ఆ గ్రంథా లయం కోసం అనేక ముద్రణా లయాలకు, గ్రంథ విక్రయ శాలలకు లేఖలు వ్రాసి అనేక గ్రంథాలు ఉచితంగా, కొన్ని సగం ధరకు, మరికొన్ని పాతికశాతం ధరకు తెప్పించి ఇచ్చారు. హనుమకొండలో బ్రిటిష్ పోస్టాఫీసు లేనందున గ్రంథాలను, పత్రికలను తమ పేరున హైదరాబాద్‌కు తెప్పించి హనుమకొండకు పంపేవారు. అంతే కాకుండా భాషా నిలయానికి స్వంత గృహవసతి కల్పించడానికి కూడా రంగారావు చాలా కృషి చేశారు. మునగాల రాజు, కొమర్రాజు లక్ష్మణరావుల సహచర్యంతో రంగారావు మద్రాసుకు తరచూ వెళ్ళేవారు. అక్కడ 1905 లో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి స్థాపించి పుస్తక ప్రచురణలు ప్రారంభించాలని నిర్ణయించారు. ముద్రణ మద్రాసులో లక్ష్మణరావు పర్యవేక్షణలో ఉండగా పుస్తకాలను చందాదారులకు చేర్చడం, వ్యాపార, రవాణా కార్యక్రమాలను రంగారావు హైదరాబాద్ నుండి స్వయంగా చేపట్టారు. కుటుంబమంతా మద్రాసుకు తరలి వెళ్లి ఆర్నెల్లపాటు అక్కడే నివసిస్తూ గ్రంథ మండలిని అభివృద్ధికి కృషి చేశారు. రావిచెట్టు స్వదేశీ ఉద్యమాన్ని బలపరిచి, స్వదేశంలో తయారైన వస్తువుల ప్రచారానికి దృఢ సంకల్పంతో పనిచేశారు. భాషా నిలయానికి పత్రికలు, కొత్త గ్రంథాలు తెప్పించినంత మాత్రాన మాతృభాషాభివృద్ధి జరుగదని భావించి, భాషా నిలయానికి అనుబంధంగా ఒక పాఠశాలను నెలకొల్పి కొత్త పద్ధతిలో చరిత్ర, భూగోళం, గణితం మొదలైనవి తెలుగులోనే బోధించాలని ఆలోచన చేశారు. దానితో పది, పన్నెండు వేలమంది విద్యార్థులతో ఒక పాఠశాల ప్రారంభించారు. కానీ సభ్యులు చేసిన వాగ్దానాలు ఆచరణకు నోచుకోలేదు. రంగారావు చొరవ తీసుకుని, చందాల కోసం తిరుగలవలసి వచ్చింది. విద్యార్థులకు పలకలు, బలపాలు, పుస్తకాలు కొనిచ్చారు. ఫలితం లేక ఆ పాఠశాల మూత పడి పోయింది. లక్ష్మీ నరసమ్మ కూడా విద్యా వికాసానికి, సాంఘిక కార్యక్రమాలతో భర్తతో పాటు పాల్గొనేవారు. స్త్రీ విద్యకై ఇద్దరూ పాటుపడ్డారు. స్త్రీలకు కుట్టు పనులు మొదలయినవి నేర్పించి వారిలో నైపుణ్యాన్ని పెంచాలనీ విద్యాభివృద్ధి చేయూత లక్ష్యంతో 'ఆంధ్రమహిళా సంఘాన్ని స్థాపించి లక్ష్మీనరసమ్మనే దాని మొదటి అధ్యక్షురాలుగా బాధ్యతల్ని చేపట్టారు. ప్రతి శుక్రవారం వారి ఇంట్లోనే స్త్రీ విద్య, శిశుపోషణ, గృహ నిర్వహణ, పాతివ్రత్యము, ఐకమత్యము మొదలయిన అంశాలపై ఉపన్యాస కార్య క్రమాలు నిర్వహించే వారు. 1908 సంవత్సరంలో మూసీనదికి భయంకరమైన వరదలు వచ్చి హైదరాబాదు నగరాన్ని ముంచి వేయగా, ఎంతో ధన, ప్రాణనష్టం జరిగింది. ఆపద కాలంలో రంగారావు హైదరాబాద్ నగర ప్రజలకు సహాయపడి, నిరాశ్ర యులైన వారికి, వసతి సౌకర్యాలు కల్పించారు. వీరు ఎంతోమంది పేద విద్యార్థులను తన ఇంట్లో వుంచు కొని ఉన్నత చదువులు చెప్పిం చారు. అలా వారి సహాయంతో పైకివచ్చిన వారిలో ఆదిరాజు వీరభద్రరావు లాంటి వారు ఉన్నారు. రావిచెట్టు రంగారావు జీవిత చరిత్రను ఆదిరాజు వీరభద్రరావు 1910 లో 'జీవిత చరితావళి' అనే గ్రంథంలో నిక్షిప్తం చేశారు. ఇది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి పక్షాన 1911 లో ప్రచురితమైంది. మాతృభాష, గ్రంథాలయాల అభివృద్ధి కోసం, సర్వస్వము ధారపోసిన రంగారావు తన ముప్పై మూడో ఏటనే 1910 జూలై 3వ తేదీన ఆకస్మికంగా కన్నుమూశారు.

## రిజర్వేషన్లను పోరాడి సాధించుకుందాం!

తెలంగాణ ఉద్యమం మన కళ్ల ముందు జ్వాలగా దహనమైంది. ప్రతి నినాదంలో ఆవేదన, ప్రతి అడుగులో ఆత్మగౌరవం ఉప్పొంగింది. ఉద్యమంలో వేలమంది యువత త్యాగాలు, కవులు, కళాకారులు రగిలించిన సాంస్కృతిక ఉప్పెన, ప్రజల అసమాన ఐక్యత అన్నీ కలిసి ఒక కొత్త రాష్ట్రాన్ని నిర్మించాయి. అయితే, దశాబ్దం తర్వాత కూడా అదే ప్రశ్న ముందుంది. స్వరాష్ట్రం నిజంగా అణగారిన వర్గాల కలలను నెరవేర్చిందా? లేక పాత అసమానతలకు కొత్త రూపం మాత్రమే వచ్చిందా? ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కేవలం నీళ్లు, నిధులు, నియా మకాల డిమాండ్‌గా మొదలై, సబ్బండ వర్ణాల ఆత్మగౌరవ సమరంగా మారింది. ఆ పోరాటానికి తొలి నిప్పురవ్వ శ్రీకాంత చారి బలిదానం.. ఆ దృశ్యాన్ని, ఆ వేదనను మనం మర్చిపోలేం. ఆ త్యాగమే యావత్ తెలంగాణ సమాజాన్ని ఏకం చేసింది.

ఆనాటి ఉద్యమ లక్ష్యం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, తరతరాలుగా నిలిచిపోయిన సామాజిక న్యాయాన్ని, పాలనలో సంపూర్ణ భాగస్వామ్యాన్ని సాధించడం. అప్పుడు సాగరహారం, మిలియన్ మార్చ్ వంటి కార్యక్రమాలు పాలకుల గుండెల్లో గుబులు రేపాయి. సకల జనుల సమ్మెలో యావత్ తెలంగాణ సమాజం, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, కుల మతాలకు, పంథాలకు అతీతంగా ఏకమైంది. 1400 మందికి పైగా అమరులైయ్యారు. రాష్ట్రమంతా ఒక్కటై పోరాడితే రాష్ట్రం సిద్ధించింది. పదేళ్లు గడిచాయి.. మరి ఆ కల నెరవేరిందా? మన ప్రాణత్యాగాల ఫలితం ఏమైంది? సామాజిక న్యాయం జరిగిందా? ప్రస్తుతం రాష్ట్రంలో సామాజిక న్యాయం వెనక్కి పోయి, పాలనా పగ్గాలు మళ్లీ పాత పెత్తందారీ వర్గాల చేతిలో ఇరుక్కుపోయాయి. అందుకే, యువత తమ సొంత రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దయనీయ దుస్థితి దాపురించిందా? ఈ ప్రశ్న ప్రతి తెలంగాణ బిడ్డను వెంటాడుతోంది.

శ్రీకాంత చారి బలిదానం తెలంగాణకు తొలి పునాది వేస్తే, బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, సాయి ఈశ్వర్ చారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కున్నాడు. బలిదానం తెలంగాణ పాలక వర్గాలు బీసీలకు చేసిన ఘోర అన్యాయానికి, వారి వంచనకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచిందని విమర్శకులు వాదిస్తున్నారు. ఉద్యమం ఏదైనా బలిదానంలో మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉంటారు. శ్రీకాంత చారి చరిత్రైతే, సాయి ఈశ్వర్ చారి నేటి కన్నీటి సాక్ష్యం. అణగారిన ఆత్మగౌరవాన్ని పాలక వర్గాలు మళ్లీ మళ్లీ కించపరుస్తున్నారని సామజిక వాదులు ఆరో పిస్తున్నారు. తెలంగాణ జనాభాలో బీసీలు 50 నుంచి 60 శాతం వరకు ఉన్నారు. ఇంతటి సంఖ్యా బలం ఉన్న వర్గానికి




రాజ్యాధికారంలో తగిన వాటా దక్కడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా వాటా బడ్జెట్‌లో, రాజకీయ నిర్ణయాల్లో, పాలనా నిర్ణయాల్లో, ఆ వాటాలో ప్రతిబింబించడం లేదు.

అసలు సమస్య ఎక్కడ మొదలైందంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం జీవో 9 జారీ చేసినప్పటికీ, హైకోర్టు దానిపై స్టే విధించింది. బీసీలకు రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కావడం, బీసీలకు రిజర్వేషన్లు అవసరమని న్యాయస్థానం ముందు నిరూపించడానికి అవసరమైన బలమైన చట్టపరమైన ఆధారాన్ని (డేటా) రూపొందిం చడంలో విఫలమవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వానికి పరాజయం తప్పలేదు. ఇది ప్రభుత్వం కోరి తెచ్చుకున్న సమస్య. స్పష్టమైన రాజకీయ చిత్తశుద్ధి లేమి, న్యాయపరమైన వైఫల్యం, రాజకీయ అధికారం తమ చేతిలో లేకపోతే చట్టబద్ధమైన హక్కులు సైతం నిలబడవనే చేదు సత్యాన్ని నిరూపించింది. బీసీలకు 42% కాదు, వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా 60% రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ఈ రాజకీయ బలహీనత నుండే పుట్టింది. అమరుల త్యాగాలు మనకు నిరాశను పంచడానికి కాదు. అవి మనలో పోరాట స్ఫూర్తిని రగిలించడానికి.. శ్రీకాంత చారి, సాయి ఈశ్వర్ చారిల బలిదానాలు ఒకటే విషయాన్ని బల్లగుద్ది చెబుతున్నాయి. రాజ్యాధికారంలో తగిన వాటా లేకపోతే, అన్యాయం ఆగదు. పాలనా పీఠంపై కూర్చోకపోతే, బడ్జెట్ కేటాయింపులపై, విద్య, వైద్య, ఉద్యోగ విధానాలపై మనకు ఎలాంటి నియంత్రణా ఉండదు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు జనాభాలో అత్య ధికంగా ఉన్నప్పటికీ, వారి మధ్య ఉన్న చిన్నపాటి విభేదాల కారణంగానే పాలనాధికారం కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. పాలకుల కుట్రను దహనం చేయాలంటే ఐక్యత అనే అస్త్రంతో పోరాడాలి. అందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ ఏకం అవ్వడం తప్ప మరో మార్గం లేదు. బలిదానాలు వద్దు. రాజకీయ అధికార యుద్ధం చేయాలి. వెనకబడిన వర్గాల వారు కేవలం ఓటర్లుగా మిగిలిపో కూడదు. న్యాయం కోసం దేవులాడే యాచకులుగా ఉండకూడదు. చట్టాలను రాసే శాసన కర్తలుగా మారాలి, రాజ్యాధికారాన్ని స్థాపించుకోవాలి. ఉద్యమ వారసత్వాన్ని, వేలమంది అమరుల ఆకాంక్షలను నిజం చేసే శక్తి, సామాజిక న్యాయాన్ని స్థాపించే శక్తి, కేవలం అధికార పీఠానికే ఉంది. నువ్వే పాలకుడివి కావాలి. చట్టాలను నువ్వే రాసుకోవాలి. అధికారం సాధించినప్పుడే, అణగారిన వర్గాలకు న్యాయం వెల్లివిరిసినప్పుడే ఈ పోరాటం ఆగాలి. ఏకమై, లక్ష్యం వైపు ఉరకాలి. సరైన సమయం ఇదే. 'మన శాసనం మనమే రాసుకుందాం అనే నినాదం'తో ముందుకు సాగాలి. ఓటే ఆయుధం రాజ్యాధికారమే ఏకైక మార్గం, చివరి లక్ష్యం కావాలి

# విజయోత్సవ ర్యాలీగా సర్పంచ్ అభ్యర్థి ఇంటింటి ప్రచార ర్యాలీ





**గ్రామ ప్రజలతో ప్రచారం నిర్వహించిన దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి దోకూరి సునీత ఇంటింటి ప్రచార ర్యాలీ ఒక విజయ ర్యాలీల తలపించింది. పడకల్ గ్రామం నుండి వందలాది మంది సర్పంచ్ అభ్యర్థి అయినా దోకూరి సునీతకు జేజేలు చెబుతూ భారీ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన దోకూరి సునీతను గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీతోనే తమ గ్రామ అభివృద్ధి జరుగుతుందని పడకల్ గ్రామ ప్రజలు అన్నారు. ఈ సందర్భంగా పడకల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి దోకూరి సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరుపేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని షాదీ ముబారక్. కళ్యాణ లక్ష్మి. ఇందిరమ్మ ఇండ్లు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మహిళా శక్తి ద్వారా రుణాలు ఇచ్చి ప్రతి రంగంలో ప్రోత్సహించడం మహిళలకు ఉపాధి కల్పించడం అలాగే గ్రామంలో సి.సి రోడ్లు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్. ఎన్నో అభివృద్ధి పనులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేయించడం జరుగుతుందని ఆయన సహకారంతో పడకల్ గ్రామాన్ని అన్ని గ్రామాలకు కెల్లా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే బాధ్యతగా ముందుకెళ్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పడకల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# కడ్తాల గ్రామం అభివృద్ధి చెందాలంటే అక్షరాస్యులను గెలిపించాలి

**విద్యావంతుడు భావండ్లపల్లి ఆనంద్ నీ భారీ మెజార్టీతో గెలిపించాలి**

**సర్పంచ్ అభ్యర్థి కి మద్దతుగా భారీగా ర్యాలీ నిర్వహించి ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు**







**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కడ్తాలను అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేయాలన్నదే తమ ముందున్న ప్రథమ లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి బావాండ్ల పల్లి ఆనంద్ అన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం కడ్తాలలోని కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బీ ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుడు బావాండ్ల పల్లి ఆనంద్ చదువుకున్న వ్యక్తులను సర్పంచ్ గా ఎన్నుకుంటే కడ్తాలు ని ఎంతో అభివృద్ధి చేయొచ్చని చదువు రాని వాళ్ళని ఎన్నుకుంటే మనం సంవత్సరాలు వెనక్కి పోవాల్సి వస్తుందని అన్నారు కొందరు వ్యక్తులు నాపై తప్పు ప్రచారాలు చేస్తున్నారు నేను ఈ ఊరి వ్యక్తిని కాదని అంటున్నారు నేను ఇక్కడే పుట్టాను ఇక్కడే చదువుకున్నాను చనిపోతే ఇక్కడే మట్టిలో కలిసిపోత అన్నారు. కడ్తాల ప్రజలు నన్ను ఎంపీటీసీగా గెలిపించారు ప్రజలకు నేను వైస్ ఎంపీపీగా సేవలు చేశాను నా ఊపిరి పోతే నా శవాన్ని కూడా ఇక్కడే ఖననం చేస్తారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే తమ ముందున్న లక్ష్యమని, అందరిని కలుపుకుని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు ఆశీర్వదించి ఉంగరం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, డిసిసి డైరెక్టర్ గంప వెంకటేష్, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్ మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళి పైన అవగాహన సదస్సు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి )"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ రెండో విడత పోలింగ్ దృష్ట్యా పోటీచేసే అభ్యర్థులకి ప్రజలకి పోలీసు వారి సూచనలు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అందరూ తూచా తప్పక పాటించాలి. ఉల్లంగిస్తే చర్యలు తప్పవు అని ఎస్సై చైతన్య కిరణ్ అన్నారు నియమావళి గురించి గ్రామాల్లోని అభ్యర్థులకు ప్రజలకు అవగాహన కల్పించారు ఏ పార్టీ లేదా అభ్యర్థిగాని కులాలు మతాల మధ్య పరస్పరద్వేష భావాన్ని సృష్టించరాదు ఎన్నికల ప్రచారానికి దేవాలయాలు మసీదులు చర్చి లాంటి వాటిని వాడుకొనరాదు వాట్సాప్ లలో ఇతర మాధ్యమాల ద్వారా గాని ఇతరులను దూషించుకోరాదు ఒకరు అంటించిన పోస్టర్లను జెండాలను ఇతర వ్యక్తులు పాడు చేయరాదు ఊరేగింపులు ర్యాలీలు సమావేశాలు వంటి వాటికీ మండల ఎమ్మార్వో అనుమతి తప్పనిసరి ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు లౌడ్ స్పీకర్లు తో తిప్పుటకు ముందస్తు అనుమతి తప్పనిసరి కేవలం ఉదయం పది గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లౌడ్ స్పీకర్లు ఉన్నటువంటి వాహనాలు వాడవలెను. ఊరేగింపులు వంటి వాటికీ ఎమ్మార్వో అనుమతి తీసుకోవాలి ట్రాఫిక్ యొక్క నియమాలు పాటించాలి అనీ ఎస్సై చైతన్య కిరణ్ అన్నారు.

# నర్రాశాలపల్లిలో స్వయంభూ దుర్గామాత విగ్రహం వెలుగులోకి విగ్రహం తరలింపు వివాదంపై గ్రామంలో చర్చలు

**సంప్రదింపులతో ముందుకు సాగాలంటూ ప్రజల విన్నపం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** నర్రాశాలపల్లి గ్రామంలో గత నెల రోజులుగా స్వయంభూ దుర్గామాత విగ్రహం వెలుగులోకి వచ్చిన ఘటనపై పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని సోలార్ ప్లాంట్ తవ్వకాలలో దర్శనమిచ్చిన ఈ విగ్రహం ప్రారంభంలో అక్కడి నుంచే తొలగించాలని ఎన్టీపీసీ యాజమాన్యం యత్నించినట్లు స్థానికులు తెలిసివచ్చిన నేపథ్యంలో గ్రామంలో పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విగ్రహం అక్కడే ఉండిపోతే దేవస్థానం నిర్మాణం, భూమి కేటాయింపు వంటి అంశాలు ఎదురవుతాయనే కారణంతో తొలగింపుపై ప్రయత్నాలు జరిగినట్లు గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో, కొందరి ప్రయత్నాలతో ఆ దుర్గామాత విగ్రహాన్ని నర్రాశాలపల్లికి తరలించడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. "ఎవరు తీసుకొచ్చినా, ఏ ఉద్దేశంతో తీసుకొచ్చినా, అమ్మవారు మన ఊరికి రావడం ఆనందదాయక మే" అని పలువురు అభిప్రాయపడ్డారు. విగ్రహం గ్రామానికి వచ్చిన తర్వాత దేవాలయం నిర్మాణం, స్థల కేటాయింపు వంటి కీలక అంశాలపై గ్రామంలో స్పష్టత రావాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. ఎన్టిపిసి యాజమాన్యాన్ని సంప్రదించి, గుడి నిర్మాణానికి ప్రత్యేక స్థలం కేటాయించేందుకు గ్రామం తరపున ఒక సమగ్ర కమిటీ ఏర్పాటుచేయడం ఉత్తమమని పలువురు ప్రస్తావించారు. "ఈ సమస్యను వ్యక్తిగత నిర్ణయాలతో లేదా కొందరి అతి ఉత్సాహంతో ముందుకు తీసుకుపోవడం మంచిది కాదు. గ్రామంలోని పెద్దలు, ప్రజలు, అన్ని వర్గాలు కలిసి తీసుకునే నిర్ణయమే గ్రామ ప్రయోజనానికి దోహదం చేస్తుంది" అని స్థానికులు పేర్కొన్నారు. మత, కుల, రాజకీయ భేదాలు పక్కనపెట్టి గ్రామం మొత్తం కలిసి పనిచేసి, దుర్గామాత గుడి నిర్మాణాన్ని గ్రామ సమిష్టి నిర్ణయంగా తీర్చిదిద్దాలని పలు వర్గాలు కోరుతున్నాయి. "ఎవరైనా చేసిన సేవను ఎవరూ మార్చలేరు. కానీ గ్రామ ప్రయోజనమే ప్రధానమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని గ్రామ ప్రజలు ఏకకంఠంగా అభిప్రాయపడుతున్నారు

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఊర్కొండ మండలంలోని జగబోయిన్ పల్లి గ్రామానికి చెందిన గడ్డం గంగమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ కాంగ్రెస్ నాయకుల ద్వారా 5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖరా చారి, ఉపాధ్యక్షుడు సయ్యద్ హైమద్, శ్యామ్ గౌడ్, రవూఫ్, నారాయణ రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మయ్య, అజహర్, నర్సింహ, నసీర్, రవి, ఆర్ రాజు బి రాజు, విజయ్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# వెల్దండ మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన శుభాకాంక్షలు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసిసి నాయకురాలు సోనియా గాంధీ 79 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోతిలాల్ నాయక్,సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య ,శంకర్ నాయ క్ , రషీద్ , తిరుపతి రెడ్డి, కొండల్, రాజు చెన్నయ్య పాల్గొన్నారు.

# శాంతియుత ఎన్నికల ప్రక్రియ కోసం సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలు

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ కాల్వ శ్రీరాంపూర్, కమాన్ పూర్, రామగిరి, మంథని, ముత్తారం, మంచిర్యాల జోన్ పరిధిలో.. దండేపల్లి, జన్నారం, లక్షెట్టిపేట మండలలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న జరగనున్న నేపథ్యంలోపైన తెలిపిన మండలాల్లో డిసెంబర్ 9న సాయంత్రం 5 గంటల నుండి ఫలితాలు ప్రకటించే వరకు సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ ఆంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధం. ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, ఫారెస్ట్ అధికారులు, కేంద్ర బలగాలు, హెూమ్‌గార్డులు మరియు ఎస్ పి ఓ లకు మాత్రం ఈ నిషేధాలు వర్తించవని తెలిపారు. ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు చట్టపరమైన అనుమతిలేకుండా చేపట్టకూడదని, పోలింగ్ కేంద్రాలకు ఒక కిలోమీటర్ పరిధిలో కర్రలు, కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని సిపి స్పష్టం చేశారు. తాత్కాలిక నిర్మాణాలు అయిన షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేయడానికి కూడా అనుమతి తప్పనిసరి అని చెప్పారు. మైకులు, లౌడ్ స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. ఎన్నికల సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు.

# తాజా మాజీ సర్పంచ్ కు ఘన సన్మానం

**టి జి పి ఏ రాష్ట్ర నాయకులు దార మధు**

**అగ్ని ధార న్యూస్ ,(మంథని), :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుమ్మునూర్ గ్రామపంచాయితీ తాజా మాజీ సర్పంచ్ బందెల లావణ్య భర్త కీర్తిశేషులు రామస్వామి లను లక్ష్మీపురం లోని వారి స్వగృహంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం ఉన్న టి జి పి ఏ మెమెంటో తో సత్కారం చేసి శాలువాతో ఘనంగా సన్మానించిన. తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అలాగే తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల బాలురు మంథని పేరెంట్స్ కమిటి చైర్మన్ దార మధు.. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బందెల రవీందర్, సంపత్, అలాగే బందెల రాజేందర్, బందెల సంపత్, బందెల ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# బసంత్‌నగర్‌లో భారీ ర్యాలీ

**సర్పంచ్ అభ్యర్థి పరికిపండ్ల రామ్‌కు ప్రజల ఘన స్వాగతం**

**చక్రవాకం ఫేమ్ సెల్వరాజ్ కుమార్, జబర్దస్త్ యాక్టర్స్ రాము వినోధ్ పాల్గొనడంతో ఉత్సాహం రెట్టింపు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** బసంత్‌నగర్ గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళవారం మరింత జోరందుకుంది. ప్రముఖ నటుడు చక్రవాకం ఫేమ్ సెల్వరాజ్ కుమార్, జబర్దస్త్ యాక్టర్లు రాము, వినోద్ ప్రత్యేక అతిథులుగా పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగి గుట్ట క్వార్టర్స్ వద్ద ముగిసింది. గ్రామంలో ఎప్పుడూ లేనంతగా మహిళలు, యువత, వృద్ధులు, కార్మికులు స్వచ్ఛందంగా తరలి రావడం ప్రచారానికి హైట్‌గా నిలిచింది.

**ర్యాలీకి నాయకత్వం వహించిన సెల్వరాజ్ కుమార్ మాట్లాడుతూ,**

"బసంత్‌నగర్ అభివృద్ధికి స్పష్టమైన దిశా దృష్టి ఉన్న నాయకుడు పరికిపండ్ల రామ్. సేవాభావం ఉన్న నాయకుల చేతుల్లోనే గ్రామం మార్పు సాధ్యమవుతుంది" అని ప్రజలను ఉద్దేశించి అన్నారు. వేలాది మంది పాల్గొన్న ఈ ర్యాలీ సందర్భంగా ప్రజలు పరికిపండ్ల రామ్‌పై తమ పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "అభివృద్ధి సేవ పారదర్శకత" ఆధారంగా రూపొందించిన మేనిఫెస్టోకు గ్రామస్తులు ఘన మద్దతు ప్రకటించారు.

**ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి పరికిపండ్ల రామ్ మాట్లాడుతూ,**

"ప్రజల ప్రేమ నాకు బాధ్యతను మరింత పెంచింది. ఆరోగ్యం, విద్య, ఉపాధి, వ్యవసాయం, పర్యావరణం, పారదర్శక పాలనలో బసంత్‌నగర్‌ను తెలంగాణలోనే 'స్మార్ట్ మోడల్ ఆదర్శ గ్రామం'గా తీర్చిదిద్దడం మా సంకల్పం" అని తెలిపారు. బసంత్‌నగర్‌లో జరిగిన భారీ ర్యాలీ గ్రామ ఎన్నికల వేడిని మరింత పెంచి, రామ్ అభ్యర్థిత్వానికి అదనపు బలం చేకూర్చింది.

# దుర్గం నగేష్ కు అంతర్జాతీయ డాక్టరేట్

**సామాజిక సేవలో విశిష్ట కృషికి అమెరికా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ సత్కారం**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** సమాజంలోని బలహీన వర్గాల కోసం సేవను బాధ్యతగా తీసుకుని పేదలకు, విద్యార్థులకు, అనాథలకు, రోగులకు అనేక కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తున్న సమతా ఫౌండేషన్ చైర్మన్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకుడు మార్షల్ దుర్గం నగేష్ నాగేశ్వరరావుకు అంతర్జాతీయ గౌరవం దక్కింది. అమెరికా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జిహెచ్పియు) , నగేష్‌కు "డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్" హనరరీ డాక్టరేట్‌ను డిసెంబర్ 13, 2025న చెన్నైలో జరిగే కాన్వొకేషన్‌లో ప్రదానం చేయనున్నారు. సేవా కార్యక్రమాలపై సెనేట్ బోర్డ్ చేసిన సమగ్ర మూల్యాంకనం మేరకు ఈ పురస్కారం నిర్ణయించినట్లు యూనివర్సిటీ తెలిపింది.

**"అంకితభావానికి అంతర్జాతీయ గుర్తింపు"**

నగేష్ చేసిన సేవలు బలహీన వర్గాల జీవితాల్లో ప్రత్యక్ష ప్రభావం చూపాయని, విద్య ఆరోగ్య సంక్షేమ రంగాల్లో ఆయన కృషి అత్యుత్తమమని "అందుకే 'డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్'కు ఆయన అర్హులు" అని అధికారిక ప్రకటనలో జీ ఎచ్ పి యు వ్యవస్థాపకులు డాక్టర్ పి మాన్యువల్ తెలిపారు .

**సేమఅభిరుచి కాదు, సమాజ బాధ్యత**

వివాహాల కోసం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సాయం, అనాథ పిల్లలకు ఆహారం బట్టలు, విద్యార్థులకు విద్యాసామగ్రి, ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం, రక్తదానం శిబిరాలు, కరోనా సమయంలో పేదలకు అన్నదానయ వంటి సేవలు నగేష్ ఆధ్వర్యంలో నిరంతరంగా కొనసాగాయి. సమతా ఫౌండేషన్ ద్వారా గ్రామ స్థాయి సేవా యూనిట్లను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను సంస్థాగతంగా విస్తరించారు.

**ఈ గౌరవంతో మరింత బాధ్యత పెరిగింది దుర్గం నగేష్**

**ఈ గుర్తింపుపై నగేష్ మాట్లాడుతూ**

"ఇది నా వ్యక్తిగత ప్రతిష్ఠ కాదుబీ సమాజ మార్పు కోసం శ్రమిస్తున్న ప్రతి సేవాకారునికీ దక్కిన గౌరవం. ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచుతోంది" అని పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీ పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన డీసీపీ



**అగ్నిధార న్యూస్ కమన్పూర్** ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలే లక్ష్యం పెద్దపల్లి జోన్ పోలీస్ సిద్ధం: పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి మొదటి విడుత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మంథని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమాన్ పూర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం రామగిరి లలో పోలింగ్ సామగ్రి పంపిణీ చేపట్టనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఈ రోజు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి సరఫరా అయ్యే బ్యాలట్ బాక్సులు, సీల్ మెటీరియల్, స్టేషనరీ, సెక్యూరిటీ కవర్ తదితర అంశాలపై అధికారులు వివరాలు ఇవ్వగా, డీసీపీ గారు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సమయంలో ఎలాంటి గందరగోళం లేకుండా పోలీసులు, రేవెన్యూ శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాలంటూ డీసీపీ ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ అందజేతలో, పోలింగ్ కేంద్రాలకు చేరడానికి ఏ ప్రాంతానికి ఎంత సమయం పడుతుందో ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిదంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద 24 గంటల నిఘా, పోలీసు పికెట్, సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండాలని, అనుమతి లేని వ్యక్తులను లోనికి రానివ్వకూడదనీ, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలి అని ఆదేశించారు. నిష్పాక్షిక, ప్రశాంత వాతావరణంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి పోలీసులు పూర్తిగా సిద్ధంగా ఉన్నారనీ ప్రజలు, అభ్యర్థులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పోలీస్ వారికీ సహకరించాలి అని డీసీపీ గారు పిలుపునిచ్చారు. డిసిపి గారి వెంట మంథని సీఐ బి. రాజు, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు, మంథని ఎస్ ఐ రమేష్, రామగిరి ఎస్ ఐ శ్రీనివాస్, కమాన్ పూర్ ఎస్ ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**ప్రజల ఆత్మ గౌరవం ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు.**

**పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, డిసెంబర్ 09:** తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు స్ఫూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహం కలెక్టరేట్ వద్ద రూపుదిద్దుకుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి. వేణులితో కలిసి మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 60 ఏళ్ల ప్రజల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా డిసెంబర్ 9న అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై మొదటిసారి సానుకూల ప్రకటన చేసిందని, ఆ రోజు ప్రజల పోరాట ఫలితాలను స్మరించుకుంటూ నేడు కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉద్యమకారులను, తెలంగాణ నిపుణుల తో చర్చించి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహానికి అధికారిక గుర్తింపు తెచ్చిందని, రాష్ట్ర సచివాలయం తో పాటు ప్రతి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం సంప్రదాయాల సంస్కృతి, పోరాట స్ఫూర్తికి ప్రత్యేకంగా నిలిచేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేశామని అన్నారు. తెలంగాణ తల్లి చేతిలో ఒకవైపు కొడవలి మరోవైపు పోత్తం/జవళి సంపద సిరి సంపత్తి సూచకంగా ఉంటుందని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పాదాల వద్ద తెలంగాణ భూభాగాన్ని సూచించే చిహ్నాలు పల్లె బతుకులు సంప్రదాయాలు జానపద సంస్కృతి ప్రతికాత్మక రూపాలు కనిపిస్తాయని తెలిపారు. తెలంగాణ తల్లి ఆకృతి, వేషధారణ, ఆభరణాలు అన్ని తెలంగాణ పల్లె మహిళల సంప్రదాయ వైభవాన్ని ప్రతిభ నుంచి రూపకల్పన చేశామని, ఈ విగ్రహం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన దీర్ఘకాల పోరాటాన్ని ప్రజల త్యాగాలను జానపద సంస్కృతిక వారసత్వాన్ని మరింత చేసే శాశ్వత దినంగా భావించ పడుతుందని అన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్‌ను సందర్శించే ప్రజలను ఆకట్టుకునేలా విగ్రహ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోందని, పనుల నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారుల పర్యవేక్షణలో నిర్మాణం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలన అధికారి బి. ప్రకాష్ , ఆర్ అండ్ బి ఈ ఈ బావ్ సింగ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం





**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**700 మంది పోలీస్‌లతో పటిష్ట బందోబస్తు**

**రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ ఎన్నికల విధులకు సంబంధించి విధులపై దిశానిర్దేశం చేశారుఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. శాంతి యుత వాతవారణంలో మొదటి విడత ఎన్నికలు నిర్వహించడానికి రూట్ మొబైల్స్ 25 , జోనల్ టీమ్స్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో 07,క్విక్ రియాక్షన్ టీమ్స్ 05 , స్ట్రయికింగ్ ఫోర్స్ 02 ఏర్పాటు చేసి మొత్తంగా 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారుపోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రాన్ని పోలింగ్ సమయంలో కౌంటింగ్ సమయంలో ఎట్టి పరిస్థితులలోనూ వదిలి వెళ్లవద్దని,రూట్ మొబైల్ అధికారులు తరచు తనకు కేటాయించిన రూట్లలలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద,రూట్ లలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని,అనవసర విషయాలు చర్చించవద్దన్నారు . ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు,మందుగుండు సామాగ్రి ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతులోనికి తీసుకువెళ్లారాదని సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణం లో ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎస్పి కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ లు ఎస్ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు

## 8550 కోట్లు ఫ్రీ బస్సు జర్నీ

**హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకానికి మంచి క్రేజ్ వచ్చింది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం రావడంతో ఉపాధి పనులు, శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలు సందర్శనలు, ఆస్పత్రులకు ఎక్కువగా వెళ్లగలిగారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ప్రారంభమై ఈ రోజు తో రెండేళ్లు పూర్తయింది. రెండేళ్ల క్రితం సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం కోసం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం మొదటగా ప్రారంభించిన స్కీం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ఈ పథకం ప్రారంభించి ఈరోజుతో రెండు ఏళ్ళు పూర్తయింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 251 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేసి.. 8459 కోట్ల విలువైన ప్రయాణాన్ని ఉచితంగా పొందగలిగారు. ఉచిత బస్సు ద్వారా కుటుంబాల మధ్య బంధుత్వాలు పెరగడంతో పాటు ఇతర అవసరాలకు మహిళలు ఆడపిల్లలు ఖర్చు లేకుండా ప్రయాణం చేయగలరని ప్రభుత్వం భావిస్తుంది.

## ముస్త్యాల ప్రజల కోసం ప్రాణం ఉన్నంతవరకు పోరాడుతా...!

**బి ఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి సుంకరి మహేందర్ (మహేష్)**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** నమ్ముకున్న గ్రామ ప్రజల ఆశీర్వాదం ఉంచి వారు గెలిపిస్తే ప్రజాసేవ చేస్తా అని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ సుంకరి మహేందర్ అన్నారు. రామగిరి మండలం ముస్త్యాల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా సుంకరి మహేందర్ (మహేష్) నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరు ఎన్ని పన్నాగాలు పన్నినా తన విజయాన్ని ఎవరు అడ్డుకోలేరని గ్రామ ప్రజల ఆశీర్వాదం తనపై ఉందని భీమా వ్యక్తం కి చేస్తూ ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను గెలిచిన తర్వాత చేయాల్సిన ముందు పనులు గ్రామ దేవత అయిన ఊరు పోచమ్మ కొలిపించడం నది ఒడ్డుకు పుష్కర ఘాటు నిర్మించడం, స్మశాన వాటికకు వెళ్లే దారి సిసి రోడ్ వేపించడం గ్రామపంచాయతీ నుండి కొత్త రోడ్డు వరకు సిసి రోడ్ వేదించడం ప్రజలకు గోపి గాడు తో పాటు వారి గుడి నిర్మించడం గ్రామంలో వీధి దీపాలు సెంటర్లైట్ ఏర్పాటు చేయడం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం ఇంకా మరెన్నో అభివృద్ధి పనులు చేయడం కోసమే మీ ముందుకు వస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వార్డు అధికారులు సమర్ధవంతంగా పర్యవేక్షణ చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):** పారిశుధ్యం నీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ తదితర మౌళిక వసతుల నిర్వహణలో సేవా లోపాలు తలెత్తకుండా వార్డు అధికారులు సమర్దవంతంగా పర్యవేక్షణ చేయాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి వివిధ మున్సిపల్ సేవల అమలు తీరుపై చర్చించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ప్రవేశ పెట్టిన రెండు పూటలా పని చేసే విధానాన్ని , సిబ్బంది హాజరును, చెత్త సేకరణ , డి ఆర్ సి కేంద్రానికి పొడి చెత్త కంపోస్ట్ యార్డు కు పొడి చెత్త వెళ్ళేలా పర్యవేక్షించాలని అన్నారు. నీటి సరఫరాకు సంబందించి నిర్ణీత సమయానికి విడుదల చేయడం లీకేజీ లు వెంటనే అరికట్టడం కనీసం ప్రతి 15 రోజులకు ఒక సారి ట్యాంకు శుభ్రం చేయడం వంటి పనులు కూడా పర్యవేక్షించాలని అన్నారు. నీటి శుద్దత కు సంబందించి పరీక్ష నిర్వహించే విధానం పై అమృత్ మిత్రలకు వార్డు అధికారులకు అవగాహన కల్పించాలని అన్నారు. నగరంలో అన్ని వీధి దీపాలు వెలిగేలా చూడడంతో పాటు కొత్తగా వేసిన స్తంభాలకు లైట్లు వెలిగించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు . అలాగే నగర పాలక సంస్థ నిర్వహణకు ప్రదాన వనరు అయిన ఆస్తి పన్ను , నల్లా బిల్లు లు లక్ష్యం ప్రకారం వసూలు చేయాలని అన్నారు. ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జల శక్తి అభియాన్ కింద ఇంకుడు గుంతల ఫోటోలు ఆన్ లైన్ లో, నల్లా వినియోగదారుల వివరాలు అమృతమ్ యాప్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ , సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆర్ ఓ ఆంజనేయులు సూపరింటెండెం ట్ పబ్బాల శ్రీనివాస్ డి ఇ లు , ఎ ఇ లు వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గడువు లోగా పూర్తి చేయాలి

**పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష..**

**సిఎంఆర్ రైస్ డెలివరీ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, డిసెంబర్-09:-** రబీ సీజన్ కి సంబంధించి సీఎంఆర్ రైస్ సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి. వేణు తో కలిసి సిఎంఆర్ రైస్ డెలివరీ పై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి రబీ సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సకాలంలో అందించాలని, సీఎంఆర్ సరఫరాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని రైస్ మిల్లులలో ఎఫ్ సి ఐ నిబంధనల ప్రకారం రా రైస్, పాలిష్ రైస్ నాణ్యత లోపం వంటి సమస్యలు పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా త్వరితగతిన సి.ఎం.ఆర్. ను గడువు లోగా పూర్తి చేయుటకు ఎఫ్.సి. ఐ అధికారులకు సూచించారు. రైస్ మిల్లర్లకు సంబంధించి రోజువారీగా రిజిస్టర్ నమోదు చేయాలని, గన్ని సంచుల కోతలు, నెంబర్స్ నమోదు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్,ఎఫ్.సి. ఐ . డివిజనల్ మేనేజర్ రవి ప్రకాష్, మేనేజర్ ఎఫ్. సి . ఐ . క్వాలిటీ కంట్రోల్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీ గెలిపించుకోవాలి

**అభ్యర్థులతో కలిసి ప్రచార నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి నియోజక వర్గంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ప్రచారం చివరి రోజు న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అధికారంలో ఉండి గ్రామాలలో అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, కావున ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నారని, సర్పంచ్ ఎన్నికల్లో మొదటి విడతలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అందరూ గెలవబోతున్నారని అన్నారు, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్,వార్డు సభ్యులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, భారతి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు! హైదరాబాద్‌లో ఎలా ఉన్నాయంటే..?



బంగారం, వెండి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. ఇటీవల భారీగా పెరిగిన ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ విధాన సమావేశానికి ముందు పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారు. స్థానిక మార్కెట్‌లో డిమాండ్ తగ్గిన నేపథ్యంలో మంగళవారం ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో అమ్మకాలు భారీగా జరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 24 క్యారెట్ల బంగారం ధర రూ.1000 తగ్గి తులానికి రూ.1,31,600కి చేరుకుంది. వడ్డీ రేట్లపై యూఎస్ ఫెడ్ రిజర్వ్ తీసుకునే నిర్ణయంపై వ్యాపారవర్గాలు వేచిచూసే స్థితిలో ఉన్నారని విశ్లేషకులు పేర్కొన్నారు. దాంతో మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రత్యక్ష ప్రభావం పడుతున్నది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీలో కమోడిటీస్ అండ్ కరెన్సీ హెడ్ సౌమిల్ గాంధీ మాట్లాడుతూ.. మంగళవారం బంగారం ధరలు తగ్గాయన్నారు. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ నిర్ణయంపై మార్కెట్ జాగ్రత్తగా ఉందని చెప్పారు. పెట్టుబడిదారుల దృష్టి అంతా పాలసీ ప్రకటన, ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగంపైనే ఉందన్నారు. ఆయన ప్రకటన డాలర్ దిశను నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బంగారం తరహాలోనే వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. ఏకంగా ఒకే సెషనల్‌లో రూ.4500 తగ్గింది. కిలోకు రూ.1,80,500కి చేరుకుంది. ఇదిలా ఉండగా.. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం స్వల్పంగా పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 0.35 శాతం పెరిగి 4,205.57 డాలర్లకు చేరుకుంది. విదేశీ మార్కెట్లలో స్పాట్ సిల్వర్ 0.75 శాతం పెరిగి ఔన్సుకు 58.59 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. ఇదిలా ఉండగా.. ఫెడ్ రిజర్వ్ సమావేశం మొదలు కాగా.. ఈ సారి 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలు వెండి ధరలకు దన్నుగా నిలుస్తున్నాయని ఆగ్‌మాంట్‌లోని పరిశోధనా విభాగం చీఫ్ రినిషా చైనాని తెలిపారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం రూ.1,29,440 పలుకుతుండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,18,650 వద్ద కొనసాగుతున్నది. ఇక వెండి కిలోకు రూ.1.99లక్షలుగా ఉన్నది.

### చాట్‌జీపీటీలో ప్రకటనలు..?




చాట్‌బాట్ చాట్‌జీపీటీలో ప్రకటనలు రాబోతున్నాయని ఇటీవల సమాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దాంతో ఓపెన్‌ఏఐ అధికారికంగా స్పందించింది. ఈ నేపథ్యంలో వినియోగదారుల్లో ఏర్పడిన గందరగోళాన్ని తొలగించడానికి చాట్‌జీపీటీ యాప్ వైస్ ప్రెసిడెంట్, హెడ్ నిక్ టర్లీ రంగంలోకి దిగి స్పష్టతనిచ్చారు. ఇటీవలి వారాల్లో చాట్‌జీపీటీ సంభాషణల్లో యాడ్ ప్యానెళ్లు కనిపిస్తున్నాయని కొందరు వినియోగదారులు పేర్కొంటూ, స్క్రీన్‌షాట్‌లను సోషల్ మీడియాలో పంచుకున్నారు. వీటిని ఖండిస్తూ నిక్ టర్లీ ఎక్స్‌లో లో ఒక పోస్ట్ చేశారు. 'చాట్‌జీపీటీలో ప్రకటనల పుకార్ల గురించి చాలా వార్తాలొస్తున్నాయి. వీటిని నమ్మొద్దు. ఎలాంటి ప్రకటన టెస్ట్‌లు కంపెనీ నిర్వహించలేదు. మీరు చూసిన స్క్రీన్ షాట్‌లు నిజమైనవి కావు' అని చెప్పారు.

# ఆపిల్ యాప్ స్టోర్‌లో వివాదాల 'సంచార్ సాథీ' హవా..

# డౌన్‌లోడ్స్ లిస్ట్‌లో నంబర్ వన్ ప్లేస్..!

కొత్తగా మార్కెట్‌లోకి తీసుకురానున్న మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను డిఫాల్ట్‌గా ఉండాలని కేంద్రం ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, కేంద్రం తీసుకువచ్చిన సైబర్ సెక్యూరిటీ యాప్ ప్రతిపక్షాలతో పాటు కంపెనీల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఉత్తర్వులను టెలికమ్యూనికేషన్స్ విభాగం (డాట్) ఉపసంహరించుకున్నది. యాప్ తప్పనిసరి ఏం కాదని స్పష్టం చేసింది. తాజాగా యాప్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. సెన్సార్ టవర్ ఇటీవల డేటా ప్రకారం.. సంచార్ సాథీ యాప్‌కు యూజర్ల నుంచి స్పందన లభించింది. నవంబర్ 29 వరకు భారత్‌లో అత్యధికంగా డౌన్‌లోడ్ చేసిన యాప్స్‌ల జాబితాలో 127వ స్థానంలో నిలిచింది. అయితే, డిసెంబర్ 2న కేవలం మూడురోజుల్లోనే గూగుల్, జెమిని, చాట్ ప్రధాన ప్లాట్‌ఫామ్‌లను అధిగమించి ఆపిల్ స్టోర్‌లో నెంబర్ వన్ ప్లేస్‌కు చేరుకుంది. అయితే, డిసెంబర్ 3న ప్రభుత్వం ప్రీ ఇన్‌స్టాలేషన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం విశేషం. అయినప్పటికీ యాప్ ఇంకా అగ్రస్థానంలోనే ఉన్నది. సంచార్ సాథీ యాప్‌పై ఒక్కసారిగా ఆసక్తిగా పెరగడానికి ప్రైవసీయే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.గోప్యతా సమస్యలు తలెత్తిన నేపథ్యంలో యాప్స్‌పై యూజర్లలో ఆసక్తిని రేకెత్తించిందని.. దాంతో డౌన్‌లోడ్స్ సంఖ్యను నేరుగా ప్రభావితం చేసింది. అయితే, కేంద్రానికి అనుకూలంగా కొందరు బీజేపీ మద్దతుదారులే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లుగా ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. డౌన్‌లోడ్స్ పెరిగేందుకు ఇదే కారణమని పేర్కొంటున్నారు. అయితే, ఇది కేవలం తాత్కాలికమేనని చెబుతున్నారు. అదే సమయంలో గూగుల్ ప్లే స్టోర్‌లోనూ సంచార్ సాథీ యాప్ డౌన్‌లోడ్స్ గణనీయంగా పెరిగాయి. డిసెంబర్ 1న 15వ స్థానంలో నిలువగా.. 3వ తేదీన రెండో స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్నది.






# హైదరాబాద్‌లో లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ల విస్తరణ



గ్లోబల్ స్కిల్లింగ్ అండ్ లెర్నింగ్ విభాగంలో సర్వీసులు అందిస్తున్న అప్‌గ్రాడ్ హైదరాబాద్‌లో రెండు కొత్త లెర్నింగ్ సపోర్ట్ సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పింది. దీని ద్వారా 'ఫిజిటల్'(ఫిజికల్ ం డిజిటల్) లెర్నింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించనున్నట్లు పేర్కొంది. ఈ విస్తరణ పెరుగుతున్న టెక్నాలజీ, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లలో నైపుణ్యాల డిమాండ్‌ను తీర్చేందుకు ఉపయోగపడుతందని కంపెనీ తెలిపింది. అప్‌గ్రాడ్ ఇప్పటికే పుణె, కోల్‌కతా, ఇండోర్, భోపాల్, బెంగళూరు వంటి నగరాల్లో 11 ఆపరేషనల్ కేంద్రాలను స్థాపించినట్లు చెప్పింది. హైదరాబాద్ ఇప్పుడు ఈ నెట్‌వర్క్‌లో కీలక ప్రాంతమని పేర్కొంది. కంపెనీ తన విస్తరణ రోడ్‌మ్యాప్‌లో భాగంగా మార్చి 2026 నాటికి ఈ నెట్‌వర్క్‌ను 40 కేంద్రాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. మెట్రో నగరాలతో పాటు టైర్-2 నగరాల్లో అత్యుత్తమ హైబ్రిడ్ లెర్నింగ్‌ను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పింది.ఏఐ, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీస్, డేటా సైన్స్‌లో నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండ్‌తో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పింది. ఈ నేపథ్యంలో అప్‌గ్రాడ్ కొత్త కేంద్రాలు నగరంలోని గ్రాడ్యుయేట్లకు నైపుణ్యాలను అందించాలని నిర్ణయించింది. కంపెనీ సీఓఓ మనీష్ కల్రా మాట్లాడుతూ 'ఏటా లక్షలాది మంది గ్రాడ్యుయేట్లు శ్రామిక శక్తిలోకి ప్రవేశించినప్పటికీ యాజమాన్యాలు ఆశించే నైపుణ్యాలకు, సాంప్రదాయ సంస్థలు అందించే వాటికి మధ్య అంతరం విస్తృతంగా ఉంది. దాన్ని పూడ్చేందుకు మా కేంద్రాలు ఎంతో తోడ్పడుతాయి' అన్నారు.

# పాండ్యా, అక్షర్ జోరు..

## 101 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా..!





వన్డే సిరీస్ విజయోత్సాహాన్ని టీ20లోనూ కొనసాగిస్తూ ఘనంగా బోణీ కొట్టింది భారత్. బరాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాను 101 పరుగుల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించింది. హార్దిక్ పాండ్యా(59 నాటౌట్, 1-16) ఆల్‌రౌండ్ షోకు.. అక్షర్ పటేల్(23, 2-7) మెరుపులు తోడవ్వగా సఫారీ టీమ్ 74కే ఆలౌటయ్యింది. పొట్టి క్రికెట్‌లో ప్రొటిస్‌కు ఇదే అత్యల్ప స్కోర్ కావడం విశేషం. టీ20ల్లో తమకు తిరుగులేదని నిరూపించిన సూర్యకుయార్ బ ృందం ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్ భారత జట్టు జోరు కొనసాగుతోంది. ఇటీవలే ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలుపొందిన సూర్యకుమార్ సేన.. స్వదేశంలోనూ వేట మొదలెట్టింది. మంగళవారం బరాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాను బెంబేలెత్తించిన టీమిండియా 101 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత్.. 12.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగించి సిరీస్‌లో ముందంజ వేసింది.

### అర్ష్‌దీప్ మొదలెట్టగా..

కటక్ బరాబతి స్టేడియంలో భారీ స్కోర్ చేసిన భారత జట్టు.. ప్రత్యర్థిని వణికించింది. తొలి ఓవర్లోనే వికెట్ తీసిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్(2-14).. తన రెండో ఓవర్లోనూ వికెట్ అందించాడు. ఫామ్‌లో ఉన్న క్వింటన్ డికాక్(0)ను డకౌట్ చేశాడు అర్ష్‌దీప్. డికాక్ ఆడిన బంతి ఎడ్జ్ తీసుకోగా స్లిప్‌లో అభిషేక్ క్యాచ్ అందుకున్నాడు. అనంతరం రెండు ఫోర్లు బాదిన ట్రిస్టన్ స్టబ్స్(14)ను సైతం ఔట్ చేసి సఫారీలను దెబ్బతీశాడీ యంగ్‌స్టర్. దాంతో.. 16 పరుగులకే రెండు బిగ్ వికెట్లు కోల్పోయింది సఫారీ జట్టు. అంతకుముందు బుమ్రా ఓవర్లో మర్క్‌రమ్(14)కు లైఫ్ లభించింది. అతడు సిక్సర్ కొట్టాలనుకున్న బంతిని బౌండరీ వద్ద శివం దూబే పైకెగిరి అందుకొని.. రోప్ తగిలేలోపు బయటకు విసిరేశాడు.

స్టబ్స్ వికెట్ పడడంతో క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్(22).. తనస్టయిల్లో చెలరేగాడు. వరుణ్ చక్రవర్తి ఓవర్లో 4,6 బాదిన బ్రెవిస్ స్కోర్ 40 దాటించాడు. అయితే.. ఆరో ఓవర్లో తొలి బంతికే మర్క్‌రమ్ లెగ్ స్టంప్‌ను ఎగరేశాడు అక్షర్ పటేల్. అంతే.. 40కే మూడు వికెట్లు పడ్డాయి. పవర్ ప్లేలో 3 వికెట్ల నష్టానికి సఫారీ టీమ్ 45 రన్స్ చేసింది. పాండ్యా మొదటి బంతికే డెవిడ్ మిల్లర్(1)ను.. డేంజరస్ డొనోవాన్ ఫెరీరా(5)ను వరుణ్ ఔట్ చేయగా 50కే ఐదు వికెట్లు కోల్పోయింది. తన ఓవరలో సిక్సర్ బాదిన మార్కో యాన్సెన్‌ను వరుణ్ బౌల్డ్ చేయగా మ్యాచ్ పూర్తిగా టీమిండియా చేతుల్లోకి వచ్చింది. బుమ్రా ఓవర్లో బ్రెవిస్ మిడాన్‌లో సూర్యకు దొరికిపోగా.. సఫారీల ఓటమి ఖాయమైంది. చివరి బ్యాటర్ మహరాజ్()ను దూబే ఔట్ చేయగా సఫారీ టీమ్ 74కే కుప్పకూలింది.

### పాండ్యా హాఫ్ సెంచరీ

పునరాగమనం మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(59 నాటౌట్) రెచ్చిపోయాడు. ఇటీవలే స్మాట్‌లో మెరుపులు మెరిపించిన పాండ్యా.. తొలి టీ20లో దక్షిణాఫ్రికాపైనే చెలరేగాడు. క్రీజులోకి వచ్చీరాగానే ఈ ఆల్‌రౌండర్ ఫోర్లు, సిక్సర్లు బాదేయగా టీమిండియా భారీస్కోర్ చేసింది. పవర్ ప్లేలో లుంగి ఎంగిడి(3-31) విజ ృంభణతో కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ అభిషేక్ శర్మ(17), తిలక్ వర్మ(26)లు ఆదుకున్నారు. వీరిద్దరి తర్వాత అక్షర్ పటేల్(23) జతగా పాండ్యా చితక్కొట్టాడు. చివరి ఓవర్లో 12 రన్స్ పిండుకోవడంతో ప్రత్యర్థికి 176 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా.

# స్పోర్ట్స్

## శ్రీలంకతో టీ20 సిరీస్.. భారత స్క్వాడ్‌లో అండర్ -19 వరల్డ్‌కప్ స్టార్లు..!





ఇటీవలే మహిళల వన్డే ప్రపంచకప్ విజేతగా అవతరించిన భారత జట్టు స్వదేశంలో తొలి సిరీస్ ఆడనుంది. డిసెంబర్ 21 నుంచి శ్రీలంకతో పొట్టి ఫార్మాట్‌లో తలపడనుంది టీమిండియా. ఇదివరకే సిరీస్ షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ.. మంగళవారం స్క్వాడ్‌ను వెల్లడించింది. తొలి ఐసీసీ ట్రోఫీ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా.. మందితో కూడిన బ ృందాన్ని ఎంపిక చేశారు సెలెక్టర్లు. సీనియర్లతో పాటు అండర్-19 వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన జి.కమలిని వికెట్ కీపర్‌గా, వైష?వీ శర్మకు బౌలర్‌గాచోటు లభించింది. స్వదేశంలో జరిగిన పదమూడో సీజన్ ప్రపంచకప్‌లో ఆడిన సీనియర్లలో చాలామంది టీ20 సిరీస్‌కు ఎంపికయ్యారు. దీప్తి శర్మ, హర్లీన్ డియోల్, స్నేహ్ రానా, రేణుకా సింగ్, శ్రీ చరణిలు స్క్వాడ్‌లోకి రాగా.. గాయపడిన ఓపెనర్ ప్రతీకా రావల్ బదులు షఫాలీ వర్మను ఎంపిక చేశారు. స్పిన్ ఆల్‌రౌండర్ రాధా యాదవ్‌కు చోటు దక్కలేదు. అయితే.. ఇటీవలే మలేశియాలో ముగిసిన అండర్ -19 వరల్డ్‌కప్‌లో రాణించిన కమలిని, వైష?వీ శర్మలు ఈ సిరీస్‌తో టీ20ల్లో అరంగేట్రం చేయనున్నారు. భారత స్క్వాడ్ : హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మ ృతి మంధాన(వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, స్నేహ్ రానా, జెమీమా రోడ్రిగ్స్, షపాలీ వర్మ, హర్లీన్ డియోల్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), శ్రీచరణి, వైష?వి శర్మ. వరల్డ్ కప్ ఛాంపియన్‌గా టీమిండియా ఆడుతున్న తొలి సిరీస్ ఇది. డిసెంబర్ 21 నుంచి డిసెంబర్ 30 వరకూ జరుగబోయే ఐదు టీ20ల సిరీస్‌లో శ్రీలంకను ఢీకొడుతుంది భారత్. ఈ ఐదు మ్యాచ్‌లకు వైజాగ్, త్రివేండ్రం(తిరువనంతపురం) నగరాలు వేదిక కానున్నాయి. టీమిండియా ఈ ఏడాది జూన్‌లో చివరి పొట్టి సిరీస్ ఆడింది. అది కూడా ఇంగ్లండ్‌లో 3-2తో విజేతగా నిలిచింది హర్మన్‌ప్రీత్ సేన. లంక విషయానికొస్తే ఆ జట్టు మార్చిలో న్యూజిలాండ్‌తో ఆడిన సిరీసే ఆఖరు. ఆ సిరీస్‌ను ఇరుజట్లు 1-1తో సమం చేసుకున్నాయి. తొలి టీ20 -డిసెంబర్ 21 ఆదివారం, విశాఖపట్టణం. రెండో టీ20 %--% డిసెంబర్ 23 మంగళవారం, విశాఖపట్టణం. మూడో టీ20 %--% డిసెంబర్ 26 శుక్రవారం, తిరువనంతపురం. నాలుగో టీ20 %--% డిసెంబర్ 28 ఆదివారం, తిరువనంతపురం. ఐదో టీ20 %--% డిసెంబర్ 30, మంగళవారం, తిరువనంతపురం. టీ20 ప్రపంచకప్ సన్నద్ధతలో ఉన్న టీమిండియాకు ఈ సిరీస్ చాలా కీలకం. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్‌తో పెళ్లి రద్దు చేసుకున్న మంధాన ఈ సిరీస్‌లో భారీ స్కోర్లతో రెచ్చిపోవాలనుకుంటోంది.



## విక్కీ కౌశల్‌కు జోడీగా దీపికా పదుకొణె? 'మహావతార్'లో పవర్ ఫుల్ రోల్!

బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె తాజాగా మరో బంపరాఫర్ దక్కించుకున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే షారుఖ్ ఖాన్‌తో కింగ్ సినిమాతో పాటు అల్లు అర్జున్‌తో కలిసి అట్లీ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తుంది ఈ భామ. అయితే ఈ రెండు సినిమాలు కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో దీపిక భాగం కాబోతున్నట్లు సమాచారం. 'స్త్రీ 2' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత దర్శకుడు అమర్ కౌశిక్ బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌తో కలిసి 'మహావతార్' అనే చిత్రాన్ని రూపొందించబోతున్న విషయం తెలిసిందే. మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాలో కథానాయికగా దీపికాను తీసుకోబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి సంప్రదింపులు జరుపగా దీపికా కూడా ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. పరశురాముడి జీవిత కథ ఆధారంగా రూపొందనున్న ఈ ప్రాజెక్ట్‌లో దీపికా పదుకొణె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, ఆ పాత్రకు ఆమె వంద శాతం న్యాయం చేయగలరని చిత్ర యూనిట్ బలంగా విశ్వసిస్తోందట. అందుకే ఆమెను తీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన దర్శకుడు అమర్ కౌశిక్, ఇప్పటికే ఆరు నెలల నుంచి ఈ ప్రాజెక్ట్ ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఇది తన కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన సినిమా అవుతుందని పేర్కొన్నారు.

# అఫీషియల్.. అఖండ 2 రిలీజ్ డేట్ ఫిక్స్

కొన్ని గంటల్లో రిలీజ్ కావాల్సిన అఖండ 2.. గత గురువారం అనూహ్యంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. అఖండ 2 నిర్మాతలకు ఈరోస్ సంస్థతో ఉన్న ఫైనాన్స్ వివాదం కోర్టుకు వెళ్లడంతో చివరి నిమిషంలో సినిమా ఆగిపోయింది. దీంతో కొత్త రిలీజ్ డేట్‌పై రకరకాల పుకార్లు చక్కర్లు కొట్టాయి. దీంతో తాజాగా నిర్మాత సంస్థ సినిమా విడుదల తేదిని ప్రకటించింది. అభిమానులు కోరుకున్నట్లుగానే ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ మేరకు నిర్మాణ సంస్థ అధికారిక ప్రకటన చేసింది. రిలీజ్‌కి ఒక్క రోజు ముందు అంటే డిసెంబర్ 11న ప్రీమియర్స్ కూడా పడనున్నాయి. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటించగా.. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషించాడు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మించారు. బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని సహ నిర్మాతగా వ్యవహరించారు.




# మహేష్ బాబుకి జక్కన్న టార్చర్ స్టార్ట్

## 'వారణాసి' కోసం ఏకంగా 5 గెటప్స్!

టాలీవుడ్‌లో రాజమౌళితో సినిమా చేయాలని కోరుకోని హీరో ఉండరు. ఆయన సినిమాలు అంటే గ్లోబల్ రేంజ్, అంతర్జాతీయ గుర్తింపు గ్యారంటీ. అయితే ఆ క్రేజ్ వెనుక ఉన్న కఠినమైన క ృషి గురించి ఇండస్ట్రీకి బాగా తెలుసు. పరెఫెక్షన్ కోసం నటీనటులను పిండేయడమే జక్కన్న స్టైల్. ఇదే విషయాన్ని గతంలో ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్ సరదాగా పలుమార్లు చెప్పిన సందరాలే ఉన్నాయి. ఇప్పుడు అదే దశలోకి సూపర్ స్టార్ మహేష్ బాబు అడుగుపెడుతున్నారు. రాజమౌళి%--%మహేష్ బాబు కాంబినేషన్‌లో రూపొందుతున్న 'వారణాసి' సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది మహేష్ కెరీర్‌లోనే కాకుండా రాజమౌళి ఫిల్మోగ్రఫీలో కూడా మరో భారీ ప్రాజెక్ట్‌గా తయారవుతోంది. ఇప్పటికే బయటికొచ్చిన సమాచారం ప్రకారం, మహేష్ బాబు ఈ సినిమాలో ఏకంగా 5 విభిన్న అవతారాల్లో కనిపించబోతున్నారట. అందులో రాముడు, రుద్రుడు కీలక పాత్రలుగా ఉండగా, మిగిలిన మూడు పాత్రలు కూడా కథకు ముఖ్యమైన వేరియేషన్స్ అన్న టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఇన్నేళ్ల కెరీర్‌లో మహేష్ బాబు ద్విపాత్రాభినయం కూడా చేయలేదు. అలాంటిది ఇప్పుడు ఒక్కసారిగా ఐదు పాత్రలు అంటే ఇది చిన్న విషయం కాదు. ప్రతి పాత్రకు భిన్నమైన బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. వాయిస్ మాడ్యులేషన్, మైండ్‌సెట్, ఎమోషనల్ రేంజ్ ఇవి అన్నింటినీ పరెఫెక్ట్‌గా చేయాల్సి వస్తోంది. రాజమౌళి ఒకే సీన్ కోసం వంద టేకులు తీస్తారనే విషయాన్ని ఇండస్ట్రీ బాగా తెలుసు. ఇప్పుడు ఐదు పాత్రలు ఉంటే మహేష్ బాబు పడాల్సిన కష్టం ఎలా ఉంటుందో అని మహేష్ ఫ్యాన్స్ ముచ్చటించుకుంటున్నారు. ముఖ్యంగా ఈ గెటప్స్ కోసం మహేష్ శారీరకంగా కూడా పలు మార్పులు చేసుకుంటున్నారు. రుద్ర లుక్ కోసం జుట్టు పెంచడం, మసిల్స్ పెంచి కొత్త లుక్‌లో కన్పించడం, రాముడి పాత్ర కోసం స్లిమ్ లుక్‌లోకి మారడం, ఇంకా మిగిలిన పాత్రల కోసం ఎంత కష్టం పడాల్సి వస్తుందని అంటున్నారు. సుమారు ?1000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న 'వారణాసి'పై ప్రపంచవ్యాప్తంగా ద ృష్టి పడింది. అందుకే రాజమౌళి ఒక్క విషయంలో కూడా రాజీ పడడం లేదు. మహేష్ బాబు కూడా దర్శకుడు చెప్పిన ఒక్క సూచనను కూడా మిస్ కాకుండా అమలు చేస్తున్నారట. మహేష్ బాబు చేస్తున్న ఈ ఐదు గెటప్స్ కథలో ఏ విధంగా మేజర్ ఇంపాక్ట్ చూపిస్తాయి? ఈ పాత్రల వెనుక రాజమౌళి ఏ మ్యాజిక్ దాచిపెట్టాడు? అన్నది తెలుసుకోవాలంటే మాత్రం ప్రేక్షకులంతా కొంతకాలం ఆగాల్సిందే.






## మగాళ్లను మొక్కుకుంటూ కాదు తొక్కుకుంటూ పోతాం.. నయా లుక్‌తో హైప్ పెంచుతోన్న పురుష టీం

టైటిల్‌తో ప్రేక్షకుల అటెన్షన్‌ను తనవైపునకు తిప్పకుంటోంది పురుష (%ూబతీబంష్ణుష్ణు%) టీం. ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనుక ఓ ఆడది ఉంటుంది.. అంటూ అందరి ఫోకస్ తనవైపు తిప్పుకుంటున్నాడు పవన్ కళ్యాణ్. వీరు వులవల డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనుక ఓ ఆడది ఉంటుంది. స్వేచ్ఛ కోసం భర్త చేసే అలుపెరుగని పోరాటం.. అంటూ ఇప్పటికే రిలీజ్ చేసిన లుక్స్ నెట్టింట హైప్ క్రియేట్ చేస్తున్నాయి. మేకర్స్ ఇప్పుడు పురుష ప్రాజెక్ట్ నుంచి మరో పోస్టర్‌ను షేర్ చేశారు. ఆమె రూల్.. ఆమె పవర్.. క్షమాపణలు లేవు.. మగాళ్లను మొక్కుకుంటూ కాదు తొక్కు కుంటూ పోతాం.. రివర్స్ మోడ్ ఆన్ అయింది.. మహిళలు అన్‌స్టాపబుల్ అంటూ రిలీజ్ చేసిన తాజా లుక్‌లో లేడీ పాదం ముగ్గురు మగాళ్లు భయానక పరిస్థితిలో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. తాజా లుక్ పురుష సినిమాపై మరింత ఆసక్తిని పెంచేస్తుంది.

బ్రహ్మచారి భర్తగా మారిన తర్వాత..

పవన్ కల్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ డిఫరెంట్ అవతారాల్లో కనిపిస్తూ ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అంటున్నారు. బ్రహ్మచారి భర్త కావాలని నిర?యించుకున్న తర్వాత జీవితం యుద్ధ భూమిగా మారుతుంది.. అంటూ ఇప్పటికే షేర్ చేసిన పోస్టర్లలో పవన్ కల్యాణ్ యుద్ధ వీరుడి గెటప్‌లో కనిపిస్తుంటే.. కసిరెడ్డి కసిరెడ్డి రాజ్‌కుమార్ స్పైడర్ మ్యాన్‌గా, సప్తగిరి దేవదూతను తలపించే గెటప్‌లో కనిపిస్తున్నారు. ఒకరి డ్రెస్‌పై ఎగిరి పక్షి బొమ్మ కనిపిస్తుంటే.. మరొకరి చాతిపై లవ్ సింబర్.. ఇంకొకరిపై కత్తెర సింబల్ కనిపిస్తున్నాయి. మొత్తానికి బ్రహ్మచారి భర్తగా మారిన తర్వాత కదనరంగంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన లుక్స్ క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. ఈ మూవీని బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బత్తుల కోటేశ్వర రావు నిర్మిస్తున్నారు. కామెడీ జోనర్‌లో వస్తోన్న వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్, అనంత్ శ్రీరామ్, రాజీవ్ కనకాల, పమ్మి సాయి, మిర్చి కిరణ్, గబిరాక్, అనైరా గుప్తా, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వైష?వి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com